# విలేఖరులు కావలెను



తెలుగు రాష్ట్రాల్లో అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా టుడే తెలంగాణ తెలుగు దినపత్రికకు రిపోర్టర్లు కావలెను. అనుభవం ఆసక్తి గలవారు సంప్రదించండి

98665 32777

todaytelangananews6@gmail.com

www.todaytelangananews.com



TO-DAY TELANGANA Telugu News Paper

# టుడే తెలంగాణ

తెలుగు దినపత్రిక    నిజం మా నైజం


పంచాంగం - 07 ఫిబ్రవరి 2026 - శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం
ఉత్తరాయణం - శిశిర ఋతువు
మాఘ మాసం - కృష్ణపక్షం
సూర్యోదయం - ఉ. 6:50
సూర్యాస్తమయం - సా. 6:09
తిథి - చవితి రా. 12:26ం వరకు
తరువాత పంచమి
సంస్కృత వారం - బృహస్పతి వాసరః
నక్షత్రం - ఉత్తర ఫల్గుని(ఉత్తర) రా. 10:57 వరకు
తరువాత హస్త
యోగం - సుకర్మ రా. 12:05ం వరకు
కరణం - బవ మ. 12:14 వరకు, బవ మ. 12:14 వరకు
వర్జ్యం - తె. 5:37 నుండి ఉ. 7:16 వరకు
దుర్ముహూర్తం - ఉ. 10:36 నుండి ఉ. 11:22 వరకు, మ. 3:08 నుండి మ. 3:53 వరకు
రాహుకాలం - మ. 1:55 నుండి మ. 3:19 వరకు
యమగండం - ఉ. 6:50 నుండి ఉ. 8:15 వరకు
గుళికాకాలం - ఉ. 9:40 నుండి ఉ. 11:05 వరకు
బ్రహ్మ ముహూర్తం - తె. 5:14 నుండి ఉ. 6:02 వరకు
అమృత ఘడియలు - మ. 3:31 నుండి సా. 5:10 వరకు
అభిజిత్ ముహూర్తం - మ. 12:07 నుండి మ. 12:52


సంపుటి: 3    సంచిక: 129    www.todaytelangananews.com    తెలంగాణ / ఆంధ్ర ప్రదేశ్ శనివారం, ఫిబ్రవరి 07 2026    పేజీలు: 8    వెల: రూ. 5/-

Published from , Suryapet, Nalgonda, Khammam, Bhadradri Kothagudem, Hyderabad, Ranga reddy, Nizamabad, Adilabad ,


# నిజామాబాద్ రైతుల పోరాటం ఆదర్శం

- కెసిఆర్‌కు దత్తపుత్రుడిగా మారిన కిషన్ రెడ్డి
- అందుకే కెసిఆర్, కెటిఆర్‌లను కాపడుతున్నాడు
- కాళేశ్వరంపై సిబిఐ విచారణకు ఆదేశించినా పట్టించుకోని కేంద్రం
- ధర్మపురి అర్వింద్‌తో జిల్లాకు ఒరిగింది శూన్యం
- బిజెపి, బిఆర్ఎస్‌లను నమ్ముకుంటే నట్టేట ముంచుతారు
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యం
- నిజామాబాద్ పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి



**నిజామాబాద్,ఫిబ్రవరి 6 :** నిజామా బాద్ రైతుల పోరాటం దేశానికే ఆదర్శమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లోని వ్యవసాయం తెలంగాణకే కాదు, దేశానికే ఆదర్శమన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అదనపు నిధులు ఇవ్వడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. నిజామాబాద్ జిల్లా బర్దీపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ సూచనలతో ఈ జిల్లాలో అభివృద్ధి పనులు చేస్తున్నాం. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయబోతున్నాం. మన వాళ్లు కార్పొరేటర్లుగా ఉంటే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. నేను అందరివాడిని. నాకు కులం, మతం లేదు. ఈ జిల్లా గొప్ప నాయకులను అందించింది. మున్సిపల్ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇవ్వాలి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ మురికి కూపంగా మిగతా2లో...



## వైభవంగా గద్దర్ ఫిలిం అవార్డుల ఫంక్షన్

- న భూతో న భవిష్యత్తు అన్నట్టు నిర్వహిస్తాం
- గద్దర్ ఆలోచనలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుంది
- ప్రపంచ ఫిల్మ్ ఇండస్ట్రీ హబ్ గా హైదరాబాద్
- సినిమా స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన భట్టి

**హైదరాబాద్, 6 :** వచ్చే ఉగాది రోజున గద్దర్ ఫిలిం అవార్డుల ఫంక్షన్ కార్యక్రమాన్ని న భూతో న భవిష్యత్తు అన్న విధంగా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్వహించాలని ప్రపంచ ఫిలిం ఇండస్ట్రీ మొత్తం హైదరాబాద్ వైపు తిరిగి చూసేలా ఆ కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకా రాలను రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రసాద్ లాబ్స్ లో గద్దర్ ఫిలిం అవార్డుల సందర్భంగా సినిమాల స్క్రీనింగ్ ప్రక్రియ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు.

మిగతా2లో...




## అండర్ 19 ప్రపంచకప్ చాంపియన్ భారత్

- ఫైనల్లో భారత్ చేతిలో ఇంగ్లండ్ చిత్తు!
- 100 పరుగుల తేడాతో గెలుపొందిన టీమిండియా
- 411 పరుగులతో భారత జట్టు ఆల్‌టైమ్ రికార్డు

పురుషుల అండర్-19 వన్డే వరల్డ్‌కప్‌లో భారత కుర్రాళ్లు టైటిల్ పట్టేశారు. తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన భారత జట్టుకు ఆరో టైటిల్ కట్టబెట్టారు. ఇంగ్లండ్‌తో ఫైనల్లో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(175) విధ్వంసక శతకంతో విరుచుకుపడగా.. బౌలర్లు ఇంగ్లండ్ బ్యాటర్లను బెంబేలెత్తించారు. అంబ్రిష్(3-56) విజృంభించగా100 పరుగుల తేడాతో ప్రత్యర్థిని మట్టికరిపించింది. 174కే ఏడు వికెట్లు పడినా.. టెయిలెండర్ ఫాల్క్‌నర్(115) వీరోచిత సెంచరీ బాదినా సరిపోలేదు. కనిష్క్ ఓవర్లో ఖిలాన్ పటేల్ డైవింగ్ క్యాచ్ అందుకోగా ఆరోసారి అండర్-19 ఛాంపియన్‌గా నిలిచింది టీమిండియా.ఇటీవల రైజింగ్ స్టార్స్ ఎమర్జింగ్ ఆసియా కప్, ఆసియా కప్‌లో తేలిపోయిన భారత జట్టు ఏనుగు కుంభస్థలాన్ని కొట్టింది. అజేయంగా అండర్ -19 ప్రపంచకప్ ఫైనల్‌కు దూసుకెళ్లిన టీమిండియా అదిరే ఆటతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసి టైటిల్‌ను ఒడిసిపట్టింది.

## మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీ

- ముహూర్తం కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్,ఫిబ్రవరి 6 :** మరో మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాన్ని సరైన సమయంలో తీసుకుంటానని చెప్పారు. మిగతా2లో...

## రెపోరేట్‌లో కానరాని మార్పులు

- యధాతథంగా ద్రవ్యపరపతి విధానం
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



**ముంబై,ఫిబ్రవరి 6 :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీరేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. మునుపటి వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. ఈ మేరకు శుక్రవారం ద్రవ్య పరపతి విధాన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం బ్జడెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ఆర్‌బీఐ నిర్వహించిన తొలి ద్వైమాసిక సమీక్ష ఇది. గత ఏడాది ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోతపెట్టింది. మిగతా2లో...

## మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తాం

- పన్నుల్లో ప్రజలకు వెసలుబాటు కల్పిస్తాం
- కోతులు, కుక్కల బెడదను నివారిస్తాం
- మేనిఫెస్టో విడుదల చేసిన బిజెపి అధ్యక్షుడు రామ్



**హైదరాబాద్,ఫిబ్రవరి 6 :** తెలంగాణలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో భాజపా విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. భాజపా విజయం సాధిస్తే పెండింగ్‌లో ఉన్న పన్నుల్లో వెసులుబా టు కల్పిస్తామని, మోడ్రన్ మున్సిపా లిటీలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తామన్నారు. అవినీతి రహిత మున్సిపాలిటీలే తమ లక్ష్యమని.. అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. మిగతా2లో...

## టిటిడి ఇవోగా ముద్దాడ రవిచంద్ర బాధ్యతలు

- శ్రీవారిని దర్శించుకున్నాక వేదాశీర్వచనం



**తిరుమల,ఫిబ్రవరి 6 :** తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవోగా సీఎంవో ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం సతీసమేతంగా భూవరాహ స్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత వైకుంఠం మిగతా2లో...



## రేవంత్ రెడ్డి తిట్ల ట్రాప్‌లో పడకండి

- కార్యకర్తలకు కెటిఆర్ పిలుపు

**హైదరాబాద్,ఫిబ్రవరి 6 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల వేళ తమ ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్‌పై, ఆయన వ్యక్తిత్వం మీద రేవంత్ రెడ్డి విషం చిమ్ముతున్నాడని మండిపడ్డారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు.. తెలంగాణ పోరాట చరిత్ర మీద జరుగుతున్న దాడి అని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల వేళ రేవంత్ రెడ్డి తిట్ల ట్రాప్‌లో పడకండి అని తెలంగాణ ప్రజలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చర్చ జరగాల్సింది మన వార్డుల్లో మౌలిక వసతుల మీద, రోడ్ల మీద, డ్రైనేజీల మీద, ఇంటింటికీ అందాల్సిన పథకాల మీద అని తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా మిగతా2లో...

## నేడు క్యాబ్ డ్రైవర్ల దేశవ్యాప్త సమ్మె

- కనీస వేతనాల అమలుకు డిమాండ్




**న్యూఢిల్లీ, 6 :** కనీస ఛార్జీలు, డ్రైవర్ల పని పరిస్థితులపై ఓలా, ఉబర్, ర్యాపిడో డ్రైవర్లు శనివారందేశవ్యాప్త సమ్మెకు దిగనున్నారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్ల యూనియన్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈ సమ్మె నిర్వహిస్తున్నారు. కనీసం ఆరు గంటల మిగతా2లో...

## ఫిరాయింపుల వ్యవహారంపై స్పీకర్ విచారణ

- పటిషన్లపై తాజాగా సుప్రీం మరోమారు విచారణ
- మూడు వారాల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం


2లో

# నిజామాబాద్ రైతుల పోరాటం ఆదర్శం

(మొదటి పేజీ తరువాయి)

మారిందని మండిపడ్డారు. ధర్మపురి అర్వింద్‌ను ఎంపీగా రెండుసార్లు గెలిపించినా.. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదు. మోదీ మూడు సార్లు ప్రధానమంత్రి అయినా.. నిజామాబాద్ స్మార్ట్ సిటీ కాలేదు. మోదీ దగ్గర ఎంపీ అర్వింద్‌కు పరపతి ఉంటే నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్ సిటీగా ప్రకటించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరంలో ప్రాజెక్టులో అవినీతి జరిగిందని భాజపా చెప్పింది. ఆ కేసును సీబీఐకి అప్పగించాం ఏమైంది? కేసీఆర్, కేటీఆర్‌ను ఎప్పుడు అరెస్టు చేస్తారని భాజపాని అడుగుతున్నానని మరోమారు ప్రశ్నించారు. కెసీఆర్, కేటీఆర్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారు. కిషన్‌రెడ్డి.. కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారని సీఎం విమర్శించారు. దత్తపుత్రుడు కిషన్ రెడ్డి, దొంగ పుత్రుడు కేటీఆర్ కలిసి కేసీఆర్ ను కాపాడుతున్నారుని ఆరోపించారు. కాళేశ్వరం కేసు సీబీఐ కి ఇస్తే 48 గంటల్లో కేసీఆర్ ను జైల్లో పెడతా మన్న కిషన్ రెడ్డి.. కాళేశ్వరం కేసును బీజేపీ ఎందుకు ముందుకు సాగనీయడం లేదు.. సీబీఐ విచారణ చేయాలని కోరినా ఇప్పుడు ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దొందు దొందే ..నిజామాబాద్ జిల్లాలో బీజేపీ, బీఆర్ఎస్ లను గెలిపిస్తే అభివృద్ధి జరగదని అన్నారు. బీజేపీనుంచి ఇద్దరు కేంద్ర మంత్రులన్నా.. నిధులు తెచ్చింది నిల్ అన్నారు. జిల్లా అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తోందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు గెలవాలంటే కాంగ్రెస్ ను గెలిపించుకోవాలన్నారు. అభివృద్దే లక్ష్యంగా నిజామాబాద్ జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశాం.. ఒక కార్పొరేషన్, ఏడు మున్సిపాలిటీలలోవెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు సీఎం రేంత్ రెడ్డి.రూ.600కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌నిర్మిస్తున్నామన్నారు. నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి 100 శాతం సహకరిస్తా..నిధులిచ్చే బాధ్యత నాది.. నిజామాబాద్ ను అభివృద్ధి చేసే బాధ్యత నాది అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్,సలహాదారు సుదర్శన్ రెడ్డి, మంత్రులు,ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా గద్దర్ ఫిలిం అవార్డుల ఫంక్షన్

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మార్పు కోసం కలలను ఉపయోగించి, ప్రజల కోసం తన జీవితాన్ని ధారపోసిన మహానుభావుడు గద్దర్ అని ఆయన సేవలను డిప్యూటీ సీఎం కొనియాడారు. అందుకే ప్రజా ప్రభుత్వం ఆయన పేరిట సినిమా అవార్డులను ప్రారంభించింది ఇది రెండవ సంవత్సరం అని వివరించారు. వచ్చే ఉగాది పర్వదినం రోజు ఘనంగా గద్దర్ ఫిలిం అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ద్దర్ చివరి రోజుల్లో వారితో తాను ఎక్కువ కాలం గడిపానని, వారి స్టూడియోలో అనేక ప్రయోగాత్మక పాటలు పాడారని, చివరి రోజుల్లో గద్దర్ రికార్డింగ్ స్టూడియోలో ఎక్కువ రోజులు గడిపారని డిప్యూటీ సీఎం గుర్తు చేసుకున్నారు. తెలుగు సినీ పరిశ్రమలోని అన్ని విభాగాలకు అవార్డులను ఇవ్వబోతున్నట్లు తెలిపారు. హైదరాబాద్ కేవలం తెలుగు ఇండస్ట్రీకే కాదు భారతదేశంలోని వివిధ భాషలకు హైదరాబాద్ కేంద్రంగా మారాలని ప్రజా ప్రభుత్వం గొప్ప సంకల్పంతో పనిచేస్తుందని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ఉండే వాతావరణ పరిస్థితులు, నిపుణులు, శాంతి భద్రతలు దేశంలోని మరే ఇతర నగరాల్లో లేవని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ఉన్న సానుకూల వాతావరణాన్ని ఉపయోగించుకొని హైదరాబాదును ప్రపంచ సినీ కేంద్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక బ్లూ ప్రింట్ తయారు చేసుకుని ముందుకు పోతుందని తెలిపారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రితోపాటు, శాఖ మంత్రి వెంకట్ రెడ్డి గారు అందుబాటులో లేరు మీ అందరిని ప్రోత్సహించాల నేది మా అందరి ఏకైక లక్ష్యం అనే సందేశాన్ని మీ అందరికీ తెలియజేయవలసిందిగా తనకు తెలిపారని డిప్యూటీ సీఎం వివరించారు. గద్దర్ ఫిలిం అవార్డుల కార్యక్రమాన్ని ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు మనస్ఫూర్తిగా తీసుకొని బాధ్యతాయుతంగా ముందుకు వెళ్తున్నారని డిప్యూటీ సీఎం అభినందిం చారు. సినీ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం, సినీ కార్మికుల కోసం, సినీ రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేయాలని ఆలోచనలను సైతం దిల్ రాజు తమతో పంచుకుంటున్నారని డిప్యూటీ సీఎం వివరించారు. జూరీ చైర్మన్ మణిశర్మ తెలియని వారు సినీ రంగంలో లేరని, తరతమ బేధాలు లేకుండా,
పారదర్శకంగా సినిమాలు చూడడమే కాదు నిష్పక్షపాతంగా అవార్డుల ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టాలనీ చైర్మన్ తో పాటు జూరీ సభ్యులను కోరుతున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. కార్యక్రమంలో ఎప్డిసి చైర్మన్ దిల్ రాజు, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మణిశర్మ, ఎప్డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కబ్జాలపై ఉక్కు పాదం మోపడంతో పాటు యువతకు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా కమలం పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావు మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను అధికారికంగా విడుదల చేశారు.ప్రధాన అంశాల్లో కోతులు, కుక్కల బెడద నివారణను చేర్చారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. మున్సిపల్ ఎన్నికల రాష్ట్ర సహ ఇన్‌ఛార్జిలు అశోక్ పర్ణామి, రేఖాశర్మతో కలిసి వికసిత తెలంగాణ.. భాజపా సంకల్ప పత్రం పేరుతో మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను రామచందర్ రావు విడుదల చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు భాజపాను చూసి భయపడుతున్నాయని అని రామచందర్ రావు అన్నారు. కేంద్రం.. తెలంగాణకు ఏం ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం రాష్ట్రానికి ఏం ఇచ్చిందో.. జిల్లాల వారీగా చెబుతామని, రేవంత్ రెడ్డి జిల్లాలకు ఏం ఇచ్చారో చెప్పగలరా అని సవాల్ విసిరారు. పోలీసులు భాజపా కార్యకర్తలపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగుండం, మంచిర్యాలలో పార్టీ కార్యకర్తలపై కాంగ్రెస్ దాడులు చేసిందని మండిపడ్డారు. 100 శాతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ , దేవాల యాల రక్షణ,
మహిళల రక్షణ. మున్సిపాలిటీల్లో దోమలు, పందులు, కుక్కలు, కోతుల బెడద నివారణ. సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి కోసం బీజేపీ మేనిఫెస్టో అంటూ రూపకల్పన తొలిసారి తెలంగాణలో అన్ని మున్సిపల్ వార్డుల్లో పోటీ చేస్తున్న బీజేపీ మెజారిటీ స్థానాల్లో కాషాయ జెండా ఎగురవేయాలని పార్టీ పట్టుదలతో ఉంది.
60 శాతానికి పైగా మున్సిపాలిటీలు,
కనీసం 5 కార్పొరేషన్లను దక్కించుకోవాలని టార్గెట్ పెట్టుకుంది. ఇందుకోసం స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కష్టపడుతున్నారు.
బీజేపీ యువ మోర్చాకు ఈ ఎన్నికల్లో ప్రత్యేక టాస్క్ ఇచ్చారు. జెన్–జీ టార్గెట్‌గా
ప్రచారంలో వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని దిశానిర్దేశర చేశారు.

# ఫిరాయింపుల వ్యవహారంపై స్పీకర్ విచారణ

**పటిషన్లపై తాజాగా సుప్రీం మరోమారు విచారణ**

**మూడు వారాల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 6 :** తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణను సుప్రీంకోర్టు మూడు వారాల పాటు వాయిదా వేసింది. న్యాయస్థానంలో తాజాగా జరిగిన విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం.. బీఆర్ఎస్, బీజేపీ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. అనర్హత పిటిషన్లపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వద్ద విచారణ ప్రస్తుతం కొనసాగుతోందని కోర్టుకు స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి మరో మూడు వారాల సమయం కావాలని ఆయన కోరారు.అసెంబ్లీ స్పీకర్‌కు ఇప్పటికే తగినంత సమయం ఇచ్చామని గతంలోనే గుర్తు చేసిన ధర్మాసనం, ఈసారి స్పీకర్ నిర్ణయం పాజిటివ్‌గా ఉండాలని స్పష్టం చేసింది. సింఘ్వీ విన్నపాన్ని మన్నిస్తూ, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఆ సమయానికి స్పీకర్ తీసుకున్న నిర్ణయాల పూర్తి సమాచారాన్ని సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా ఈ వ్యవహారంలో స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను స్పీకర్ అమలు చేయలేదని మహేశ్వర్ రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన దాఖలు చేసిన ఈ ధిక్కరణ పిటిషన్‌ను కూడా ప్రధాన పిటిషన్‌తో కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మూడు వారాల గడువులోగా ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. కోర్టు పర్యవేక్షణలో ఉన్న ఈ కేసు తెలంగాణ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ఎన్‌కౌంటర్‌లో కామారెడ్డి మావోయిస్ట్ మృతి



**నాగపూర్,ఫిబ్రవరి 6 :** మహారాష్ట్రలోని గడ్చిరోలిలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ఘటనలో ఇప్పటి వరకు ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. భమ్రాగఢ్ తాలూకా ఫడేవా అటవీప్రాంతంలో గురువారం నుంచి భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరుగుతున్నాయి. నిన్న ముగ్గురు మావోయిస్టులు మృతి చెందగా, ఇవాళ మరో నలుగురి మృతదేహాలను గుర్తించారు. మృతుల్లో గడ్చిరోలి డివిజన్ కమిటీ ముఖ్య నేత ప్రభాకర్ ఉన్నట్టు గుర్తించారు. అతడి స్వస్థలం తెలంగాణలోని కామారెడ్డి. మావోయిస్టు ప్రభాకర్‌పై రూ.50లక్షల రివార్డు ఉందని పోలీసులు వెల్లడించారు. ఎదురుకాల్పుల్లో ఒక పోలీసు అధికారి ప్రాణాలు కోల్పోగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి ఒక ఏకే–47 రైఫిల్‌తో సహా పలు ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# తెలంగాణలో పవన్ ప్రచారం రద్దు

**నల్లగొండ,ఫిబ్రవరి 6 :** తెలంగాణలో జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన రద్దు అయ్యింది.. ఆదివారం నల్గొండలో బీజేపీ తరఫున మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పవన్ కల్యాణ్ పాల్గొంటారని ముందే ప్రకటించింది తెలంగాణ బీజేపీ.. అయితే, తాజాగా పవన్ పర్యటన రద్దు అయినట్టు వెల్లడించింది.. ఏపీలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు.. వ్యక్తిగత కారణాలతో పవన్ పర్యటన రద్దయ్యిందని ప్రకటించింది బీజేపీ.. ఇక, తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో 336 వార్డుల్లో జనసేన పార్టీ తరఫున అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.. ఈ నెల 11వ తేదీన జరగనున్న తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 336 వార్డుల్లో జనసేన పార్టీ పోటీ చేస్తున్నట్టు పార్టీ ప్రకటించింది.. ఇందుకు సంబంధించి పార్టీ అభ్యర్థుల ః–ఫారమ్‌లు దాఖలు చేయగా, స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను ఆమోదించారు. ఈ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులు గాజు గ్లాస్ గుర్తుపై పోటీ చేయనున్నారని పార్టీ వెల్లడించింది..

# రెపోరేట్‌లో కానరాని మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

ఆ తర్వాత డిసెంబర్‌లో మరో పావు శాతం తగ్గించింది. దాంతో గత ఏడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 7.4 శాతం వృద్ధి నమోదవుతుందని ఆర్బీఐ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27) తొలి త్రైమాసికంలో 6.9 శాతం, రెండో త్రైమాసికంలో 7 శాతం వృద్ధి నమోదవ్వొచ్చని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 2.1 శాతంగా ఉండొచ్చని తెలిపింది. అదేవిధంగా 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 4 శాతం, రెండో త్రైమాసికంలో 4.2 శాతం ద్రవ్యోల్బణం నమోదు కావచ్చని అర్బీఐ అంచనా వేసింది. కాగా జనవరి చివరి నాటికి ఫారెక్స్ నిల్వలు 723.8 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వ్యవస్థలో ద్రవ్య లభ్యత రోజువారీ సగటున రూ.75 వేల కోట్లుగా ఉంది.

# టిటిడి ఇవోగా ముద్దాడ రవిచంద్ర బాధ్యతలు

(మొదటి పేజీ తరువాయి)

క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి వెళ్లిన ఆయన.. రంగనాయకుల మండపంలో ఇన్‌ఛార్జ్ ఈవోగా బాధ్యతలు స్వీకరించి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రవిచంద్ర మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారి భక్తుడిగా ఎంతో మందికి సేవచేసే భాగ్యం దక్కిందన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం, భక్తుల నమ్మకాన్ని నిలబెడతానని స్పష్టం చేశారు. టీటీడీ బోర్డు, అధికారులతో పాటు అందరి సలహాలు, సూచనలు తీసుకుని సమన్వయంతో ముందుకు సాగుతానన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా ఉండేలా పరిపాలన కొనసాగిస్తానని చెప్పారు. తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వివాదం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం.. టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ముద్దాడ రవిచంద్రకు టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ఉంటూనే టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవో బాధ్యతలనూ రవిచంద్ర నిర్వర్తించనున్నారు.

# నేడు క్యాబ్ డ్రైవర్ల దేశవ్యాప్త సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

పాటు డ్రైవర్లు ఈ సమ్మెలో పాల్గొంటారని కార్మిక సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. సమ్మె కారణంగా దేశవ్యాప్తంగా క్యాబ్, ఆటో, బైక్ ట్యాక్సీ సేవలకు అంతరాయం ఏర్పడనుంది. సమ్మెలో పాల్గొనే డ్రైవర్ల సంఖ్యను బట్టి ఆయా ప్రాంతాల్లో సేవల్లో సమ్మె తీవ్రత కనిపించనుంది. కనీస ఛార్జీలు, గిగ్ వర్కర్ల పని పరిస్థితులను నిరసిస్తూ ఈ ఆందోళన చేపడుతున్నట్లు తెలంగాణ గిగ్ అండ్ ఎ÷–లాట్‌ఫామ్ వర్కర్ల యూనియన్ పేర్కొంది.క్యాబ్ సేవలను నియంత్రించేందుకు తీసుకొచ్చిన మోటార్ వెహికల్ అగ్రిగేటర్ గైడ్‌లైన్స్, 2025 ఉన్నప్పటికీ ఆయా ఎ÷–లాట్‌ఫామ్స్ మాత్రం ఇష్టానుసారం ఛార్జీలు నిర్ణయిస్తున్నాయని కార్మికసంఘాలు పేర్కొంటున్నాయి. కాబట్టి ప్రభుత్వమే జోక్యం చేసుకుని కనీస ఛార్జీలను నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రైవేటు వాహనాలను కమర్షియల్ అవసరాలకు వినియోగించడంపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. డ్రైవర్ల ఆదాయానికి రక్షణ కల్పించడంతో పాటు, పని పరిస్థితుల మెరుగు కోరుతూ ఈ సమ్మె చేపడుతున్నారు. గతేడాది ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా ఫుడ్ డెలివరీ, క్విక్‌కామర్స్ వర్కర్లు సమ్మె చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో కేంద్రం చొరవ తీసుకుని 10 నిమిషాల డెలివరీ హామీని తొలగించాలని ఆయా కంపెనీలకు సూచించింది. దీంతో బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో 10 నిమిషాల హామీని తొలగించాయి.

# మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీ

(మొదటి పేజీ తరువాయి)

తనకు సెంటిమెంట్ ఎక్కువన్న ఆమె.. మంచి మూహూర్తం కోసం ఎదురు చూస్తున్నానని తెలిపారు. కొంత కాలం గడిచిన తర్వాత తన బలం ఏంటో అందరికీ అర్థమవుతుందని కవిత వ్యాఖ్యానించారు. ప్రజలే తనను నాయకురాలిగా తీర్చిదిద్దాలని, వారి మద్దతే తనకు అసలైన బలమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో తనకు ఒరిగిందేమీ లేదని స్పష్టం చేసిన కవిత.. భవిష్యత్తులో తన రాజకీయ ప్రయాణం పూర్తిగా ప్రజల మద్దతుపైనే ఆధారపడి ఉంటుందన్నారు.ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఎందుకు ప్రచారం చేయడం లేదని కవిత ప్రశ్నించారు. జాగృతి సంస్థ పోటీ చేస్తున్న ప్రాంతాల్లో హరీశ్ రావు ఎందుకు తిరుగుతున్నారని నిలదీశారు. అలాగే కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గానికే ఎందుకు పరిమితమయ్యారని ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. తనపై విమర్శలు చేస్తున్న వారిపై కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'గుంటనక్క, గూఢచారి' వంటి పేర్లు వారికి నప్పుతాయి కాబట్టే అలా పిలుస్తున్నాన న్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, కానీ వ్యక్తిగత ఆరోపణలు చేస్తే తాను కూడా మౌనంగా ఉండబోనని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తన రాజకీయ వ్యూహం మరింత స్పష్టంగా ఉంటుందని, కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలవుతుందని కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇదిలావుంటే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై జాగృతి అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

# రేవంత్ రెడ్డి తిట్ల ట్రాప్‌లో పడకండి

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. పద్నాలుగేళ్ల సుదీర్ఘ పోరాటంతో, ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించి మన స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన నాయకుడు కేసీఆర్. ఒక తండ్రిలా ఈ రాష్ట్రాన్ని అక్కున చేర్చుకుని, పడావు పడ్డ తెలంగాణను ప్రగతి బాటలో నడిపించిన మహోన్నత శిల్పి కేసీఆర్. కానీ, నేడు అధికారం చేతిలో ఉందనే అహంకారంతో, తన వైఫల్యాలను, తన ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ మీద, ఆయన వ్యక్తిత్వం మీద విషం చిమ్ముతున్నాడు. ఇది కేవలం ఒక వ్యక్తి మీద దాడి కాదు.. తెలంగాణ పోరాట చరిత్ర మీద జరుగుతున్న దాడి అన్నారు. రేవంత్ రెడ్డి 'తిట్ల ట్రాప్'లో పడకండి! మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చర్చ జరగాల్సింది మన వార్డుల్లో మౌలిక వసతుల మీద, రోడ్ల మీద, డ్రైనేజీల మీద, ఇంటింటికీ అందాల్సిన పథకాల మీద. కానీ రేవంత్ రెడ్డి తెలివిగా తన బూతు పురాణంతో అసలు చర్చను పక్కదోవ పట్టిస్తున్నాడు. ఈ విషపు వలలో మనం పడకూడదు. మన చర్చ, మన నిలదీత కేవలం ప్రజల కన్నీటి మీదనే ఉండాలి.ఒక్కటంటే ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాని ఆరు గ్యారంటీల గురించి నిలదీయండి. ఆ నమ్మకద్రోహం మీద యుద్ధంలా చర్చను మార్చండి అంటూ పిలుపునిచ్చారు. మన దృష్టిని ప్రజల సమస్యల మీదనే ఉంచుదాం.. మనకు ప్రాణసమానమైన తెలంగాణను ప్రజాస్వామ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకుందాం అని కెటిఆర్ అన్నారు.

# రేవంత్‌పై ఎన్నికల పిటిషన్

**- రేవంత్ అభ్యర్థనకు హైకోర్టు తిరస్కరణ**

**హైదరాబాద్,ఫిబ్రవరి 6** హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. తనపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. 2023 లో భూపాలపల్లిలో జరిగిన బహిరంగ సభలో తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కేసులు నమోదు కాగా, వాటిని రద్దు చేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అయితే ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని పేర్కొన్న న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది.

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# హోరెత్తుతున్న ఎన్నికల ప్రచారం



**పరకాల(వరంగల్):** మునిసిపల్ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గరపడుతున్న కొద్దీ ప్రచారం హోరెత్తుతోంది. అభ్యర్థులు గెలుపు కోసం ఓటర్లను ఆకర్శించడానికి రకరకాల ఎత్తులు ప్రదర్శిస్తున్నారు. మైకులు, కళాకారుల ఆట పాటలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఈ నెల 11న పోలింగ్ జరగనుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నుంచి ముఖ్య నాయకులు తమ అభ్యర్థులను గెలిపించుకోవడానికి స్థానికంగా ఉంటూ ప్రచారం చేస్తున్నారు.కొందరు స్వతంత్ర్య అభ్యర్థులు కూడా ప్రధాన పార్టీలకు ధీటుగా ప్రచారం చేస్తూ దూసుకుపోతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతీ మునిసిపాలిటీ గెలుచుకోవాల్సిందే అని ఎమ్మెల్యేలకు, నాయకులకు దిశానిర్దేశం చేయడంతో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పట్టణంలో పట్టు నిలుపుకుంటే కేడర్‌లో జోష్ పెరుగడం వల్ల కేడర్‌ను కాపాడుకుని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు సులభం అవుతుందని బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు భావిస్తున్నాయి. దీంతో ప్రధాన పార్టీల నాయకులు ప్రచారానికి పదును పెంచుతున్నారు. కౌన్సిలర్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థులు బల నిరూపణకు పోటీ పడి ప్రజలను ప్రచారానికి తీసుకెళ్తున్నారు. ప్రచారానికి వెళ్తే ఒక్కొక్కరు రూ. 200 నుంచి 500 వరకు ముట్టచెబుతున్నారు. మరికొన్నిచోట్ల రూ. 200 ఇవ్వడంతో పాటు చికెన్, బిర్యానీ కూడా పంపిణీ చేస్తున్నారు. కార్నర్ మీటింగులకు ఓటర్లను తరలించే కొందరు నాయకులకు వారి గ్రూప్ సంఖ్యను బట్టి రూ5000 నుంచి రూ20000వరకు ముట్టచెబుతున్నారు. ప్రత్యర్థి పార్టీల్లో నాయకులకు డబ్బు, మద్యం ఎరగా వేసి ఎన్నికల్లో గెలుపుకోసం మార్గాలు తయారు చేసు కుంటున్నారు. కోవర్టులను ఏర్పాట్లు చేసుకుని వారి ఎత్తులను చిత్తు చేయడానికి అభ్యర్థులు డబ్బులు ఆశ చూపుతున్నారని సమాచారం. ప్రత్యర్థి అభ్యర్థితో ఉండే ముఖ్యమైన నాయకులు పార్టీ మారకున్నా సమాచారం చేరవేసి వారి ఓటమికి కృషి చేసే వారికి రూ. 50000 నుంచి రూ.లక్ష వరకు ముట్ట చెబుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఓటర్లనే కాకుండా ప్రత్యర్థి పార్టీల నాయకులను కూడా ప్రలోభాలకు గురి చేసి పార్టీలు మారడానికి వ్యూహాలు రచిస్తున్నారని తెలిసింది. ఏదిఏమైనా ఎన్నికల ప్రచారం ఇంకా నాలుగు రోజులే మిగిలి ఉండ డంతో పార్టీలు ఎన్ని ఎత్తులు వేస్తాయో, ఎవరు ఎటు జంప్ అవు తారో ఓటర్ల మనసు ఎలా ఉం టుందో వేచి చూడాలి.

# నేను జాతరకు దూరంగా ఉండలేదు



**హనుమకొండ:** మేడారం జాతరకు తాను దూరంగా ఉన్నానని జరుగుతున్న ప్రచారాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి మంత్రి కొండా సురేఖ తిప్పికొట్టారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో మేడారం హుండీల లెక్కింపును ప్రారంభించిన అనంతరం మీ డియాతో మాట్లాడారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉండి జాతరకు రాకుండా ఎలా ఉంటాన్నారు. పను ల ఒత్తిడి వల్ల ఒకటి రెండు సార్లు మాత్రమే రాలేద ని చెప్పారు. తాను ఎప్పుడూ ఇద్దరు తల్లులు గద్దెపైకి వచ్చిన తర్వాతే వస్తానన్నారు. దీనిని ఆసరా చేసుకొని కొందరు రాలేదన్న ప్రచారం చేశారని అన్నారు.ఎవరు కూడా అమ్మవార్ల దగ్గర రాజకీయం చేయరన్నారు. ఇన్ని కోట్లు ఖర్చు పెట్టి, ఇంత కష్టపడి గద్దెలను కట్టిన తర్వాత మేం రాజకీయం ఎందుకు చేసుకుంటామన్నారు. అందరం కలిసి కట్టుగా పని చేశామన్నారు. కనుకనే గద్దెల నిర్మాణం జరిగిందన్నారు. ఎక్కడ, ఏ చిన్న అభిప్రాయ భేదం, చర్చ జరగలేదన్నారు. ఇంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మాణం చేసినప్పుడు ప్రతిపక్షాలు సానుకూలంగా మాట్లాడాలని, కానీ విమర్శించడమనేది వారి విజ్ఞతకే వది లేస్తున్నానన్నారు.పెరగనున్న హుండీ ఆదాయ ఈసారి మేడారం జాతర ఆదాయం పెరిగే అవకాశం ఉందని మంత్రి సురేఖ తెలిపారు. జాతరకు గతంలో కన్నా కోటిమంది ఎక్కువగా వచ్చారని, దీనితో ఆదాయం కూడా పెరగవచ్చు నన్నారు. వాస్తవంగా 50లక్షల మంది అదనంగా వస్తారని అంచనా వేశామని, తల్లుల గద్దెలను సుందరీకరించడం వల్ల అనుకున్నదానికన్నా ఎక్కువ మంది భక్తులు వచ్చారన్నారు. భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరగడంతో సహజంగానే జాతరలో కొన్ని ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. కోట్లాది మంది భక్తులు ఉప్పెనలా వచ్చినప్పుడు ఇలాంటివి జరగడం సహజమని, ప్రతి పక్షాలు దీన్ని రాజకీయం చేయాలని ప్రయత్నించారన్నారు. అయి నా కూడా జాత ర ప్రశాంతంగా జరిగిందని మంత్రి చెప్పారు. తల్లుల గద్దెల వద్ద కొన్ని రాళ్లు ఊడి చెదిరిపోయాయని, వాటిని త్వరలోనే పునర్మించి, ఇక ముందు అలా జరగకుండా ఉండేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులు ఎప్పుడైనా వచ్చి తల్లుల ను దర్శనం చేసుకునేలా, వారు అక్కడ బస చేసేలా మరిన్ని ఏర్పాట్లు చేయాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన అన్నారు. సీఎం ఆలోచన మేరకు గద్దెల పనులను పునఃప్రారంభిస్తామని తెలిపారు. హుండీల సంఖ్య పెరిగినందువల్ల లెక్కింపునకు ఎక్కువ రోజులు పట్టవచ్చునన్నారు. జాతరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా ఎన్ఆర్ఐలు పెద్ద సంఖ్యలో వచ్చారని, దీనితో హుండీల్లో పెద్దమొత్తం విదేశీ కరెన్సీ కూడా కానుకల రూపంలో పడ్డాయని మంత్రి చెప్పారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు మూడు వారాల్లోగా నిర్ణయం తీసుకోండి అసెంబ్లీ స్పీకర్‌కి సుప్రీంకోర్టు ఆదేశం



**ఢిల్లీ, ఫిబ్రవరి 6 :** తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు (విచారణను సుప్రీంకోర్టు మూడు వారాల పాటు వాయిదా వేసింది. న్యాయస్థానంలో ఈరోజు జరిగిన విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం.. బీఆర్ఎస్ , బీజేపీ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. అనర్హత పిటిషన్లపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వద్ద విచారణ ప్రస్తుతం కొనసాగుతోందని కోర్టుకు స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి మరో మూడు వారాల సమయం కావాలని ఆయన కోరారు.సుప్రీంకోర్టు స్పందన.అసెంబ్లీ స్పీకర్‌కు ఇప్పటికే తగినంత సమయం ఇచ్చామని గతంలోనే గుర్తు చేసిన ధర్మాసనం, ఈసారి స్పీకర్ నిర్ణయం పాజిటివ్‌గా (సానుకూలంగా) ఉండాలని స్పష్టం చేసింది. సింఘ్వీ విన్నపాన్ని మన్నిస్తూ, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఆ సమయానికి స్పీకర్ తీసుకున్న నిర్ణయాల పూర్తి సమాచారాన్ని సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.పిటిషన్ దాఖలు చేసిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి .బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా ఈ వ్యవహారంలో స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను స్పీకర్ అమలు చేయలేదని మహేశ్వర్ రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన దాఖలు చేసిన ఈ ధిక్కరణ పిటిషన్‌ను కూడా ప్రధాన పిటిషన్‌తో కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మూడు వారాల గడువులోగా ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. కోర్టు పర్యవేక్షణలో ఉన్న ఈ కేసు తెలంగాణ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ పార్టీలో నా మెడ నరకాలని చూస్తున్నరు సీనియర్ నేత జీవన్‌రెడ్డి భావోద్వేగం



**జగిత్యాల :** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. ఎన్నికల్లో తన వర్గానికి సీట్లు కేటాయించకుండా పక్కకు పెట్టడంపై ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయంగా తన మెడ నరకడానికి కాంగ్రెస్ పార్టీలో ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తన భుజాలుగా ఉన్న వ్యక్తులను తనకు దూరం చేశారని చెప్పారు.పార్టీ మారితే రాళ్లతో కొట్టమని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ప్రచారం సందర్భంగా పార్టీకి చెందిన మహిళలు, కార్యకర్తలతో ఆయన తన బాధను చెప్పి కన్నీళ్లు పెట్టుకున్నారు. దాంతో వారు జీవన్‌రెడ్డిని ఓదార్చారు. మున్సిపాలిటీలో తాము మీ వర్గాన్ని గెలిపించి తీరుతామని చెప్పారు. కాగా చట్టసభలకు ఏ పార్టీ తరఫున గెలిస్తే ఆ పార్టీలోనే ఉండాలని గతంలో రాహుల్‌గాంధీ చెప్పిన విషయాన్ని జీవన్‌రెడ్డి గుర్తుచేశారు.రేవంత్ రెడ్డి ఆయన పార్టీ మారితే రాళ్లతో కొట్టాలని గతంలో చెప్పారని, కానీ ఆయనే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. వేరే పార్టీల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన వాళ్లను ఓటుతో కొట్టాలని తాను అంటున్నానని చెప్పారు. తన వర్గం వారికి కాంగ్రెస్ సీట్లు నిరాకరించడంతో కొన్ని వార్డుల్లో స్వతంత్ర్యులుగా బరిలో దిగిన తన వర్గం వారి తరఫున జీవన్‌రెడ్డి ప్రచారం చేశారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తన వర్గాన్ని పక్కనపెట్టి.. తనతోపాటు బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన వారిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. సంజయ్ కుమార్ తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని చెబుతున్నారని, కానీ కాంగ్రెస్ జెండా పట్టుకుని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌లోనే ఉన్నా అంటూ సంజయ్ కాంగ్రెస్ జెండాను ఎత్తుకుపోయాడని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో దొంగలు పడ్డారని వ్యాఖ్యానించారు.

# బీజేపీ మేనిఫెస్టో విడుదల కోతులు, కుక్కల బెడద నివారణతోపాటు కీలక హామీలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 6 :**తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై భారతీయ జనతా పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. పురపోరులో కమలనాథులు కదనరంగంలోకి దూకారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలిచేందుకు కమలం పార్టీ కసరత్తు చేస్తోంది. ఢిల్లీ నేతలను మోహరించి.. గల్లీల్లో జెండా పాతేందుకు వ్యూహాన్ని రచిస్తునా న్నరు. 60 శాతానికి పైగా మున్సిపాలిటీలు తమవే అంటోంది కమలం పార్టీ. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావు మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను అధికారికంగా విడుదల చేశారు.స్థానిక సంస్థల ఎన్నికలను రాజకీయంగా కీలకంగా భావిస్తున్న భారతీయ జనతా పార్టీ, ఈ ఎన్నికల ద్వారా ప్రజల్లో తన బలాన్ని చాటాలని వ్యూహాత్మకంగా ముందుకెళ్తోంది. ఎన్నికల మేనేజ్‌మెంట్‌లో తనదైన ముద్ర వేసేందుకు బీజేపీ జాతీయ నాయకత్వం ఇప్పటికే ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది. మున్సిపల్ ఎన్నికల ఇన్‌ఛార్జ్, మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్‌తో పాటు కో-ఇన్‌ఛార్జులు అశోక్ పర్నామి, రేఖా శర్మ ఇప్పటికే రాష్ట్రంలో మకాం వేశారు. క్షేత్రస్థాయిలో అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచార వ్యూహాల వరకు అన్నీ తానై చూస్తున్నారు షెలార్. గతంలో జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇన్‌ఛార్జ్‌గా పనిచేసిన షెలార్.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందంటూ ఇప్పటికే ఛార్జ్ షీట్ విడుదల చేసింది. కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులతోనే పట్టణాల్లో అభివృద్ధి సాధ్యమవుతోందని, రాష్ట్ర ప్రభుత్వం నిధులను పక్కదారి పట్టిస్తో ఓందని కమలనాథులు అంటున్నారు. ప్రధాన అంశాల్లో కోతులు, కుక్కల బెడద నివారణను చేర్చారు.మేనిఫెస్టో ప్రధాన హామీలు:పన్నుల పెంపు లేదు, వారం రోజుల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు, బస్తీ దవాఖానలు, స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి, క్లీన్ సిటీ, గ్రీన్ టౌన్.100 శాతం డ్రైనేజీ , దేవాలయాల రక్షణ, మహిళల రక్షణ.

# భాగ్యనగరంలో రెచ్చిపోయిన నేపాలీ గ్యాంగ్



**హైదరాబాద్, ఫిబ్రవరి 6 :** జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధి నందగిరి హిల్స్‌లోని ఓ ఇంట్లో దోపిడీ దొంగలు(జీరెచ్చిపోయారు. ఆ ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలను దొంగలు దోచుకెళ్లారు. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.వాచ్‌మన్‌కు మత్తు మందు..పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందగిరి హిల్స్‌లోని ఓ ఇంట్లో దోపిడీ దొంగలు విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేశారు. రూ.20 లక్షలు విలువ చేసే బంగారం, డైమండ్స్ దోచుకెళ్లారు. నిందితుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలను పోలీసులు ఏర్పాటు చేశారు. నందగిరి హిల్స్ నుంచి జూబ్లీ చెక్ పోస్ట్ వరకు సీసీ టీవీలను పరిశీలించారు. మొదటగా.. ఆ ఇంటి వద్ద సెక్యూరిటీగా ఉన్న వాచ్‌మన్‌కు మత్తుమందు కలిపి ఇచ్చారు. ఆ తర్వాత ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లేలా చేశారు. వాచ్‌మన్ మత్తులోకి జారుకోగానే దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంటి లాకర్‌లోని బంగారు ఆభరణాలు మొత్తం ఎత్తుకెళ్లారు. ఈ చోరీ కేసులో నలుగురు నేపాలీలను ప్రధాన అనుమానితులుగా భావిస్తున్నారు పోలీసులు.దొంగల కోసం గాలింపు బాధితుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. దొంగల కదలికలను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దొంగలు నగరం విడిచి వెళ్లకుండా విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లలో ముమ్మర తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. గతంలోనూ ఈ తరహా నేరాలకు పాల్పడిన పాత నేరస్థుల జాబితాను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. నగరంలో నేపాలీ గ్యాంగ్‌ల సంచారం పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా పని మనుషులు, వాచ్‌మెన్‌లను నియమించే సమయంలో వారి ఆధార్ కార్డులు, పూర్తి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని పోలీసులు సూచిస్తున్నారు.

# బాబోయ్ పులి వరంగల్ జిల్లా కుందారంలో పాదముద్రల గుర్తింపు



**లింగాలఘణపురం(వరంగల్):** మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి బయలుదేరిన మగ పులి లింగాలఘణపురం మండలం కుందారం శివారుకు చేరుకున్నట్లు అటవీశాఖాధికారులు గుర్తించారు. బుధవారం రాత్రి కుందారం శివారులో సంచరించినట్లు స్థానిక రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో లింగాలఘణపురం ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ వణ్యప్రాణుల సంరక్షణా విభాగానికి సమాచారాన్ని చేరవేశారు. దీంతో గురువారం నాడు కుందారం చేరుకున్న అటవీశాఖాధికారులు పులి తిరిగిన ప్రదేశాన్ని పాదముద్రల (పగ్ మార్క్స్) ఆధారంగా పరిశీలించి పులి సంచరిస్తున్నట్లు నిర్ధారించారు.వారం పదిరోజులుగా యాదాద్రిభువనగిరి, సిద్ధిపేట జిల్లాలో సంచరించిన పులి.. తాజాగా రెండు రోజుల కిందట జనగామ జిల్లాలోకి ప్ర వేశించింది. మొదట బచ్చన్నపేట మండలంలోకి ప్రవేశించి తిరిగి యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం టంగుటూరు, శారాజీపేట మీదుగా జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం జీడికల్ నుంచి బుధవారం నాటికి కుందారం శివారులోకి ప్రవేశించింది. అప్పటికే పగ్‌మార్క్స్ ద్వారా పులి ట్రాకర్‌ను పరిశీలిస్తున్న అటవీశాఖాధికారులు.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ కచ్చితమైన కదలికలను తెలుసుకునేందుకు కెమెరా ట్రాప్స్, థర్మల్ డ్రోన్స్‌తో అన్వేషిస్తుండటం గమనార్హం.

# కౌన్సిలర్ అభ్యర్థి హామీలు.. పెళ్లికి రూ.25వేలు.. ఆడ పిల్ల పుడితే రూ.10వేలు, మగ బిడ్డ జన్మిస్తే రూ.5వేలు




**సుల్తానాబాద్ :**తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల సందడి కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. ఇక ప్రచారంలో అభ్యర్థులు బిజీగా ఉన్నారు.. ఓటర్లను ఆకట్టుకునేందుకు హామీలతో సిద్ధమ య్యారు. గతంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కనిపించిన హామీల సిత్రాలు.. ఈసారి కూడా మొదలయ్యాయి. ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు వినూత్నమైన హామీలతో ముందుకు వచ్చారు. పెద్దపల్లి జిల్లాలోని ఓ మున్సిపాలిటీ కౌన్సిలర్ అభ్యర్థి ప్రకటించిన హామీలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపాలిటీ 9వ వార్డు నుంచి ఆల్ ఇండియా ఫ్వార్డ్ బ్లాక్ పార్టీ తరపున అభ్యర్థిగా గొట్టం మహేష్ పోటీలో ఉన్నారు. అయితే తనను గెలిపించాలంటూ ఓటర్లను కోరుతూ కొన్ని హామీలను, సంక్షేమ కార్యక్రమాలను ప్రకటించారు. తనను కౌన్సిలర్‌గా గెలిపిస్తే సొంత డబ్బుతో ఈ హామీలను నెరవేరుస్తానని చెబుతున్నారు మహేష్. అంతేకాదండోయ్.. తాను కౌన్సిలర్‌గా గెలిస్తే అమలు చేయబోయే పనుల్ని ఓ బాండ్‌పేపర్‌పై రాసి మరీ విడుదల చేయడం విశేషం. తాను గెలిస్తే.. పెళ్లి చేసుకునే యువతులకు రూ.25,016 ఇస్తానని ప్రకటించారు. అంతేకాదు ఆడ పిల్ల పుడితే రూ.10,016, మగ పిల్లాడు పుడితే రూ.5,016 ఇస్తానని హామీ ఇచ్చారు. ఒకవేళ తాను ఈ హామీలను అమలు చేయకపోతే తన కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించడం కొసమెరుపు. ఈ హామీలన్నీ రాసిన బాండ్ పేపర్‌తో ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు మహేష్.

# తెలంగాణలో కొత్తగా వాహనం కొనుగోలు చేసేవారికి పండగే.. 2% అదనపు పన్ను రద్దు!

**హైదరాబాద్, ఫిబ్రవరి 6** తెలంగాణ ప్రజలకు శుభవార్త.. రెండో వాహనం కొనుగోలు చేసేవారికి ఊరట దక్కనుంది. రాష్ట్రంలో ప్రజలు రెండో వాహనం కొనుగోలు చేసేవారికి 2% అదనపు లైఫ్‌ట్యాక్స్ నుంచి త్వరలోనే రిలీఫ్ ఇవ్వనుంది. ఈ మేరకు రవాణాశాఖ 2శాతం పన్ను ఎత్తివేతపై ప్రతిపాదన చేయగా.. సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది అంటున్నారు. తెలంగాణలో ప్రతి ఏటా 7 లక్షల వరకు కొత్త బైకులు.. అలాగే కార్లు 2.57 లక్షల వరకు కొనుగోళ్లు ఉంటున్నాయి. వీటిలో రెండోసారి 1.91 లక్షల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఇలా రెండో వాహనం కొనుగోలు చేసేవారు అదనంగా లైఫ్‌ట్యాక్స్ చెల్లిస్తున్నారు.రెండో వాహనం కొనుగోలు చేసేవారు 2శాతం లైఫ్ ట్యాక్స్ కడుతున్నారు. ఉదాహరణకు ఎవరైనా రూ.1.20 లక్షల విలువైన బైక్ కొనుగోలు (రెండో వాహనం) చేస్తే అదనంగా 2% లైఫ్‌ట్యాక్స్ కింద రూ.2,400 కడుతున్నారు. ఇలా చూస్తే తెలంగాణ రవాణాశాఖకు ప్రతి ఏటా రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. అయితే ప్రభుత్వం అదనంగా ఉన్న 2శాతం లైఫ్ట్ ట్యాక్స్‌ను రద్దుకు నిర్ణయం తీసుకుంది.. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రజలపై భారం తగ్గుతుంది అంటున్నారు. అయితే ఈ 2శాతం లైఫ్‌ట్యాక్స్ రద్దుకు సంబంధించి అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉంది.

# టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవోగా ముద్దాడ రవిచంద్ర బాధ్యతల స్వీకరణ



**తిరుమల, ఫిబ్రవరి 6:** తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఇన్‌ఛార్జ్ ఈవోగా సీఎంవో ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్రశుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నేడు ఉదయం సతీసమేతంగా భూవరాహ స్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి వెళ్లిన ఆయన.. రంగనాయకుల మండపంలో ఇన్‌ఛార్జ్ ఈవోగా బాధ్యతలు స్వీకరించి శ్రీవారిని దర్శించుకున్నారుసీఎంకు ధన్యవాదాలు: రవిచంద్రఅనంతరం రవిచంద్ర మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారి భక్తుడిగా ఎంతో మందికి సేవచేసే భాగ్యం దక్కిందన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు( ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం, భక్తుల నమ్మకాన్ని నిలబెడతానని స్పష్టం చేశారు. టీటీడీ బోర్డు, అధికారులతో పాటు అందరి సలహాలు, సూచనలు తీసుకుని సమన్వయంతో ముందుకు సాగుతానన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా ఉండేలా పరిపాలన కొనసాగిస్తానని చెప్పారుతిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వివాదం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం.. టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ముద్దాడ రవిచంద్రకు టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ఉంటూనే టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవో బాధ్యతలనూ నిర్వర్తించనున్నారు రవిచంద్ర

# బాలకృష్ణ నియోజకవర్గంలో కాల్పుల కలకలం నిందితుడిపై పోలీసుల ఫైరింగ్



**అమరావతి, ఫిబ్రవరి 6:** శ్రీ సత్యసాయి జిల్లాలో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ కవాడి నాగేంద్రను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులపైనే దాడికి దిగిన అతడిని కాల్పులు జరిపి మరీ అదుపులోకి తీసుకున్నారు. 2024లో హిందూపురం చిలమత్తూరులో అత్తాకోడళ్లపై గ్యాంగ్ రేప్ కేసులో నాగేంద్ర నిందితుడిగా ఉన్నాడు. దాదాపు 40 కేసుల్లో నిందితుడిగా ఉన్న అతడు.. పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. చిలమత్తూరు అటవీ పరిసర ప్రాంతాల్లో ఉన్నట్టు తెలియడంతో.. పోలీసులు అరెస్ట్ చేయడానికి వెళ్లగా వారిపై దాడికి తెగబడ్డాడు.పోలీస్ సిబ్బందిపై నాగేంద్ర కత్తితో దాడి చేయడంతో.. రవి అనే కానిస్టేబుల్ గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే అదనపు సిబ్బందితో కలిసి సీఐ ఆంజనేయులు అక్కడకు చేరుకుని నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు ముమ్మరం చేశారు. ఆత్మరక్షణలో భాగంగా పోలీసులు.. నాగేంద్రపై కాల్పులు జరిపారు. నిందితుడి కాళ్లపై తుపాకీ పేల్చి ఎట్టకేలకు అతణ్ని అదుపులోకి తీసుకున్నారు. అత్తాకోడళ్లపై గ్యాంగ్ రేప్ కేసు.. ట్రయిల్‌లో ఉన్నప్పటి నుంచి నాగేంద్ర పరారీలో ఉన్నాడు. అతడిపై ఆంధ్రా, కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో సుమారు 70 కేసులు ఉన్నాయి. కేవలం ఏపీలోనే నాగేంద్రపై 40 కేసులు ఉన్నట్టు తెలుస్తోంది. కరుడుగట్టిన నేరస్థుణ్ని వెంటాడి మరీ పోలీసులు అరెస్ట్ చేశారు. స్వయంగా జిల్లా ఎస్పీ పర్యవేక్షలో నిందితుడిని అరెస్ట్ చేసేందుకు కొద్ది నెలలుగా పోలీసులు ప్రయత్నాలు చేపట్టారు. చివరకు ఈరోజు నాగేంద్రను అరెస్ట్ చేశారు. నిందితుడిపై ఉన్న అనేక కేసుల్లో విచారణ పూర్తిచేసి శిక్షలు పడేలా పోలీసులు చర్యలు తీసుకోనున్నారు.

# ఇబ్రహీంపట్నంలో జగన్ అభిమానుల హల్‌చల్



**విజయవాడ, ఫిబ్రవరి 06:** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ఇబ్రహీంపట్నంలో శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికంగా ఏర్పాటు చేసిన జగన్ ఫెక్సీలకు ఆయన అభిమానులు చేతులు కోసుకుని రక్త తిలకం దిద్దారు. అలాగే బైట్ స్టంట్లతోపాటు 'జై జగన్, సీఎం సీఎం జగన్' అంటూ పెద్దఎత్తున నిదానాలు చేశారు. వారిని నిలువరించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. వారి ప్రయత్నాలను ఆపే క్రమంలో.. జగన్ అభిమానులు గుంపులు గుంపులుగా పోలీసుల మీదకు దూసుకెళ్లారు. దీంతో ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. మరోవైపు జోగి రమేశ్‌తోపాటు పలువురు నేతలు అక్కడే ఉన్న అభిమానులను కట్టడి చేయకపోవడం గమనార్హం.ఇంకోవైపు ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి వద్ద జగన్ కాన్వాయ్‌లో ప్రైవేట్ ఆసుపత్రికి చెందిన అంబులెన్సు ఇరుక్కుపోయింది. ఈ విషయాన్ని వైసీపీ శ్రేణులు పట్టించుకోలేదు. దాదాపు అరగంటపాటు కాన్వాయ్‌లోనే అంబులెన్స్ ఇరుక్కుపోవడంతో.. రోగితోపాటు వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాంతో రోగి బంధువులు స్వయంగా రంగంలోకి దిగి.. ట్రాఫిక్‌కు క్లియర్ చేసి అంబులెన్స్ ముందుకు వెళ్లేలా మార్గం సుగమం చేశారు. వైసీపీ శ్రేణుల వ్యవహారశైలిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇబ్రహీంపట్నంలోని మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్‌ను ఈ రోజు వైఎస్ జగన్ పరామర్శించనున్నారు. అందుకోసం ఉదయం 10.30 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి ఇబ్రహీంపట్నంకు భారీ కాన్వాయ్‌తో వైఎస్ జగన్ బయలుదేరారు.

# ఆధ్యాత్మిక కార్యక్రమానికి వెళ్తున్నట్టుగా జగన్ పర్యటనలు



**అమరావతి, ఫిబ్రవరి 6:** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని టీడీపీ ఎంపీ అప్పలనాయుడు తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పులివెందుల ఎమ్మెల్యే జగన్.. తాడేపల్లి ప్యాలెస్ నుంచి జోగి రమేష్ ఇంటికి వెళ్తున్నారని అన్నారు. సభ్యసమాజం తలదించుకునే విధంగా మాట్లాడిన వ్యక్తుల ఇంటికి పరామర్శకు వెళ్తున్నారని మండిపడ్డారు. జగన్ పర్యటనలు ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్నాయని ఎంపీ ధ్వజమెత్తారు.ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా జగన్ పర్యటనలు సాగుతున్నాయని ఎంపీ అప్పలనాయుడు విమర్శించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు చేపడుతుంటే.. దానికి జగన్ ఆటంకం కలిగిస్తున్నారంటూ నిప్పులు చెరిగారు. జగన్ పర్యటనలపై ప్రజలు విసుక్కుంటున్నారని.. వైసీపీ నేతలు బూతు పురాణాలు తగ్గించాలని కోరుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఏదో ఆధ్యాత్మిక కార్యక్రమానికి వెళ్తున్నట్టు జగన్ తన పర్యటనలు చేస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సమాజానికి మార్గదర్శకంగా రాజకీయ నేతలు ఉండాలని హితవుపలికారు.

# మా ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం



**విజయవాడ, ఫిబ్రవరి 6 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ విజయవాడ పర్యటనపై కీలక వ్యాఖ్యలు చేశారాయన. జగన్ పర్యటనకు తామెప్పుడూ ఆటంకం కలిగించమని స్పష్టం చేశారు. శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి వీరాంజనేయ స్వామి హాజరై మాట్లాడారు.జగన్ పర్యటన వల్ల ప్రజలు ఇబ్బంది పడొద్దు..జగన్ పర్యటన వల్ల ప్రజలకు ఇబ్బంది ఉండకూడదని మంత్రి చెప్పుకొచ్చారు. మాజీ సీఎం పర్యటన వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వంపై బురదజల్లితే చూస్తు ఊరుకోమని హెచ్చరించిన ఆయన.. జగన్ అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎక్కువసేపు ఆపించద్దని సీఎం చంద్రబాబు తమను ఆదేశించారని.. ప్రజల సౌఖ్యమే మనకు కావాలని చెబుతారని మంత్రి ప్రస్తావించారు. జగన్ పెళ్లిళ్లు, ఫంక్షన్ల వద్ద కూడా తమ ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ రాజకీయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్ తన బుద్ధి మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలి..2047 నాటికి ఇండియా అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి అభివృద్ధి చెందిన దేశంగా మారాలని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఆకాంక్షించారు. 'ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో మనం రెండో స్థానంలో ఉన్నాం. జీడీపీలో మూడో స్థానంలో చేరబోతున్నాం. మనమిత్ర, ఆదర్ సెంటర్స్, మీ సేవ వంటి టెక్నాలజీ మొత్తాన్ని మన శాఖ ద్వారా ఇంప్లిమెంటేషన్ చేస్తున్నాం. ప్రభుత్వానికి సంబంధించిన సుమారు 100 సేవలను మేము అందిస్తున్నాం. సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల నుంచి ఈ సేవలు అందిస్తున్నాం. వీటి తనిఖీల కోసం కోసం సుమారు 70 నుంచి 100 మంది సిబ్బంది కేటాయిస్తున్నాం. లోపాలు సరిదిద్ది సక్రమమైన మార్గంలో ప్రజల కోసం సరైన సేవలు అందిస్తాం. కొత్త సిబ్బందికి ఓరియెంటేషన్ ప్రోగ్రాం ద్వారా ట్రైనింగ్ ఇస్తున్నాం. క్వాలిటీ వర్క్ చేయించుకోవడానికే ఇంత మంది సిబ్బందిని కేటాయిస్తున్నాం. ప్రభుత్వం నుంచి అందే పథకాలు అందుతున్నాయో లేదో ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాం' అని మంత్రి తెలిపారు.

# ఆర్థిక లెక్కలపై సీఎం చంద్రబాబు అసహనం



**కర్నూలు, ఫిబ్రవరి 6 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొని, రాజముద్రతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం రైతుల్లో హర్షాతిరేకాలను కలిగించింది.ప్రభుత్వ స్టాళ్ల పరిశీలన.గ్రామసభా ప్రాంగణంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. రైతులు, గ్రామస్తులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నా రు. భూ హక్కులు, భూ రికార్డుల తదితర అంశాలపై అధికారు లకు పలు సూచనలు చేశారు.ఆర్థిక లెక్కలపై అసహనం..ఈ సందర్భంగా జిల్లా, నియోజకవర్గం, మండల, గ్రామ స్థాయి ఆర్థిక లెక్కలపై సీఎం చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. 'తలసరి ఆదాయం వివరాలన్నీ ముందుగానే నేను చదువుకొని వచ్చాను' అని పేర్కొంటూ, కాకి లెక్కలు కాకుండా కరెక్ట్ డేటా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సిరికి సీఎం చంద్రబాబు స్పష్టంగా సూచించారు. అధికారులు సమగ్ర అవగాహనతో, బాధ్యతగా సమాచారం ఇవ్వాలని మార్గనిర్దేశం చేశారు. ఎమ్మెల్యేలు, మంత్రులకు కూడా ఆర్థిక అంశాలపై పూర్తి అవగాహన ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సరైన డేటా, స్పష్టమైన విశ్లేషణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.బుడగ జంగాలపై కీలక ప్రకటనబుడగ జంగాల అంశంపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని గతంలోనే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించానని తెలిపారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. ఎస్సీలకు రిజర్వేషన్లు మినహా అందే అన్ని ప్రయోజనాలు బుడగ జంగాలకూ అందేలా నిన్ననే సంతకం చేశానని వెల్లడించారు. బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చేంత వరకు వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.రైతులకు భరోసా..'మీ భూమి – – మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతుల భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని సీఎం చంద్రబాబు తెలిపారు. భూ రికార్డులు స్పష్టంగా ఉంటే రైతులకు భద్రత, ఆర్థిక స్థిరత్వం వస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# జగన్ గుంటూరు టూర్ పలువురు వైసీపీ నేతలపై కేసులు



**గుంటూరు, ఫిబ్రవరి 06:** వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గుంటూరు పర్యటన సందర్భంగా పలువురు వైసీపీ నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీస్ యాక్ట్ 30ను ఉల్లంఘిస్తూ అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించారని ఆరోపిస్తూ ఈ చర్యలు తీసుకున్నారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విజయవాడ పర్యటనలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. మాజీ మంత్రి జోగి రమేశ్ నివాసంపై ఇటీవల జరిగిన దాడి పరిణామాల నేపథ్యంలో ఆయనను పరామర్శించాలని జగన్ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ తరఫున భరోసా ఇచ్చేందుకు జగన్ ఈ పర్యటన చేపట్టినట్లు సమాచారం. పోలీసులు జారీ చేసిన నిబంధనలను అతిక్రమించకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు వైసీపీ వర్గాలు ఈ నిర్ణయం తీసుకున్నాయని వార్తలు వస్తున్నాయి.విజయవాడ వారధి మీదుగా వెళ్లాల్సిన యాత్రను మార్చుకుని మంగళగిరి, ఎర్రబాలెం మీదుగా వెస్ట్ బైపాస్ నుంచి ఇబ్రహీంపట్నం ద్వారా జోగి రమేశ్ ఇంటికి చేరుకోనున్నారు జగన్. ఆయన పర్యటన దృష్ట్యా వెస్ట్ బైపాస్, ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు.రూట్ మ్యాప్ మార్పునకు కారణాలివే.వైఎస్ జగన్.. తన పర్యటనలో భాగంగా విజయవాడ వారధి మీదుగా వెళ్లాలని తొలుత నిర్ణయించుకున్నారు. అయితే ఈ విషయంపై విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు అభ్యంతరం వ్యక్తం చేస్తూ (గురువారం) రాత్రి జగన్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ వారధి విజయవాడకు అత్యంత కీలకమైన మార్గమని, జగన్ ఇటువైపుగా వెళ్తే భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశముందని పోలీసులు పేర్కొన్నారు. సాధారణ ప్రజలకు, అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో జగన్ తన రూట్ మార్చుకోవాలని పోలీసులు సూచించారు. పోలీసుల ఆంక్షలు, నోటీసుల నేపథ్యంలో జగన్ తన ప్రయాణ మార్గాన్ని మార్చుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లపాడులో బలసాని కిరణ్ కుమార్, పోతిన మహేశ్‌పై కేసు నమోదు చేశారు. అలాగే తాడేపల్లిలో దొంతిరెడ్డి వేమారెడ్డి, మంగళగిరిలో నూనె ఉమామహేశ్వర్ రెడ్డిపై కేసులు నమోదయ్యాయి. నగరంపాలెం ప్రాంతంలో నూరి ఫాతిమా, పానుగంటి చైతన్యపై కేసులు నమోదు కాగా.. గుంటూరు పట్టాభిపురంలో అంబటి మురళిపైనా కేసు నమోదైంది.జగన్ పర్యటన సందర్భంగా నిర్వహించిన ర్యాలీల కారణంగా.. గుంటూరులోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడిందని పోలీసులు తెలిపారు. అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించడం, పోలీస్ నిబంధనలను అతిక్రమించడం చట్టవిరుద్ధమని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

# ఏపీలో ఆ పథకాలు మళ్లీ ప్రారంభం ఒక్కొక్కరికి రూ.40వేలు, రూ.20వేలు ఇస్తారు ఫ్రీగానే



ఆంధ్రప్రదేశ్‌లో కార్మికులకు శుభవార్త.. ప్రభుత్వం సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకుంది. కార్మిక శాఖపై సమీక్ష చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. కార్మికులకు వరాలు ప్రకటించారు. కార్మికుల్లో పరిశ్రమలకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలను పెంచే అంశంపై దిశానిర్దేశం చేశారు. 'జిల్లాల వారీగా, రంగాల వారీగా కార్మికుల డేటా బేస్ కు రూపకల్పన చేయాలి.. గిగ్ వర్కర్లు, నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల ఆదాయాలు పెరిగేలా కార్యాచరణ సిద్ధం చేయాలి.ఆధునిక నైపుణ్య శిక్షణ ద్వారా ఏపీలోని కార్మికులు విదేశాలకు వెళ్లి ఆదాయాలు వచ్చేలా చూడాలి' అన్నారు.గతంలో కార్మికులకు అందించిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించా లన్నారు చంద్రబాబు.. ఈ మేరకు కొన్ని వరాలు ప్రకటించారు. 'ప్రసూతికి రూ.20వేలు, వివాహానికి రూ.40వేలు, సహజ మరణానికి రూ.60వేలు, అంత్యక్రియలకు రూ.20వేలు ఆర్థికసాయం అందించాలి.. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. కార్మికులకు నిర్మాణ రంగంలో నైపుణ శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి. దీని కోసం ప్రముఖ నిర్మాణరంగ సంస్థల సహకారం తీసుకోవాలి. ఈ నైపుణ్య శిక్షణ తర్వాత అర్హులైన వారికి విదేశాల్లో కూడా ఉపాధి అవకాశాలు కల్పించేలా చూడాలి. జిల్లాల వారీగా కార్మికులకు సంబంధించి వారి నైపుణ్యాలపై ఓ డేటా బేస్ రూపొందించాలి. ఈ వివరాలను నైపుణ్యం పోర్టల్‌తో లింక్ చేయాలి. కార్మికులు కూడా వారికి అవసరమైన కోర్సులు పూర్తి చేసేలా ప్లాన్ చేయాలి.. వారి ఆదాయాలు పెరిగేలా చూడాలి. కార్మికులకు ఆయా రంగాలకు సంబంధించి అవసరమైన ఆధునిక పరికరాలను కూడా అందజేయాలి' అని ఆదేశించారు ఏపీ ముఖ్యమంత్రి. 'రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 లక్షలమంది కార్మికుల నైపుణ్యాలు పెంచేలా చూడాలి. రాష్ట్రంలో కంపెనీలు, పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయి.. కాబట్టి ఆ కంపెనీలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కార్మికులు శిక్షణ పొందేలా చూడాలి. కార్మికలకు నైపుణ్యం పెరిగితే.. ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.. వారి ఆదాయం కూడా పెరుగుతుంది. అలాగే కార్మికులకు అవసరమైన ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహించాలి. ఒకవేళ వారిలో ఎవరికైనా అనారోగ్య సమస్యలు ఉంటే గుర్తించాలి. కార్మిశాఖ, యూనివర్సల్ హెల్త్‌పాలసీతో రూ.2.5లక్షల వరకూ ఉచిత వైద్యచికిత్సలు, అలాగే ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా భరించేలా చూడాలి. కార్మికుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి' అని చంద్రబాబు అధికారులకు సూచించారు.

# లిక్కర్ స్కామ్ నిందితుడి ఆస్తుల అటాచ్ ప్రభుత్వం ఆదేశం



**అమరావతి, ఫిబ్రవరి 6:** వైసీపీ పాలనలో జరిగిన మద్యం కుంభకోణంలో నిందితుడు బాలాజీ యాదవ్ ఆస్తుల అటాచ్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయన తండ్రి కుల్లాయప్ప పేరిట ఉన్న ఆస్తులనూ అటాచ్ చేయాలని సర్కార్ ఆదేశించింది. ఏపీఎస్‌బీసీఎల్‌లో 2019–24 మధ్య కాలంలో జరిగిన అక్రమాలకు సంబంధించి ఈ ఆస్తులను అటాచ్ చేయాలని నిర్ణయించింది. తిరుపతి సమీపంలోని రేణిగుంట, మంగళం, సెట్టిపల్లి గ్రామాల పరిధిలో విలువైన భూములను కుల్లాయప్ప పేరిట నిందితులు రిజిస్టర్ చేయించారు. వసుప్రాధ ఎన్‌క్లేవ్ లేఅవుట్‌లో ఉన్న ప్లాట్లనూ కొనుగోలు చేసినట్టు గుర్తించారు.తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి వైకుంఠపురంలోని ఓ నివాస భవనాన్ని కుల్లాయప్ప పేరిట రిజిస్టర్ చేయించారు నిందితులు. బాలాజీ యాదవ్‌కు గిఫ్ట్ డీడ్ల పేరిట రిజిస్టరైన ఆస్తులకూ.. అక్రమ మద్యం ఆదాయం నుంచే సొమ్ములు చెల్లించినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా.. తిమ్మాయగుంట, వెంకటాపురం గ్రామాల్లోని ఓపెన్ ప్లాట్‌ను మద్యం అక్రమ నగదుతో కొనుగోలు చేశారని సమాచారం. అలాగే.. గాంధీపురం పంచాయతీ పరిధిలో గల ఓ ఇంటినీ 2021లో అక్రమార్జనతోనే కొనుగోలు చేసినట్టు అధికారులు గుర్తించారు. సిట్ దర్యాప్తులో భాగంగా ఆస్తి పత్రాలు, సాక్ష్యాల ఆధారంగా మద్యం కుంభకోణం ద్వారా పొందిన అక్రమ లాభాలతోనే ఈ ఆస్తులను కొనుగోలు చేసినట్టు అధికారులు తేల్చారు. అవినీతి నిరోధక చట్టం ప్రకారం.. ఈ ఆస్తులన్నింటినీ అటాచ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో చట్ట ప్రకారం.. తదుపరి చర్యలు చేపట్టి, నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని డీజీపీని ఆదేశిం చారు. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్‌లు.. ఈ ఆస్తులపై తదుపరి లావాదేవీలు, రిజిస్ట్రేషన్లు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# నెహ్రూ వల్లే చైనా చేతిలో ఓడిపోయాం- నిజాలున్నా 'బ్రూక్స్ - భగత్' నివేదికపై మేం రాజకీయం చేయలేదు

కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణె పుస్తకం వ్యవహారానికి కౌంటర్ ఇస్తూ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు కీలక వ్యాఖ్యలు చేశారు. 1962 యుద్ధంలో చైనా చేతిలో భారత్ ఘోర ఓటమికి నాటి నెహ్రూ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలే కారణమనే అంశం 'హెండెర్సన్ బ్రూక్స్ – భగత్' నివేదికలో ఉందని ఆయన తెలిపారు. ఈవిషయం తెలిసినప్పటికీ ఆ నివేదికను అధికార రహస్యం (క్లాసిఫైడ్)గానే ఉంచాలని మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని రిజిజు చెప్పారు. ముమ్మాటికీ ఈ నిర్ణయం సరైందేనన్నారు.'హెండెర్సన్ బ్రూక్స్ – భగత్' నివేదిక దేశ రక్షణతో ముడిపడిన సున్నితమైన అంశమైనందున, దాన్ని తాము రాజకీయ అస్త్రంగా వినియోగించలేదన్నారు. ఈ మేరకు శుక్రవారం రిజిజు ఒక ట్వీట్ చేశారు. 2024 నవంబరు 1న ఎక్స్ వేదికగా తాను చేసిన ఒక ట్వీట్‌ను ఆయన ఇప్పుడు మళ్లీ షేర్ చేశారు. ఆ రోజున చైనా సరిహద్దుల్లోని అరుణాచల్ ప్రదేశ్ పట్టణం బుమ్లాలో భారత ఆర్మీ జవాన్ల దీపావళి వేడుకల్లో కేంద్ర మంత్రి రిజిజు పాల్గొన్నారు. చైనా సరిహద్దుల్లో భారత ఆర్మీ మౌలిక సదుపాయాలను మోదీ సర్కారు బలోపేతం చేసిన అంశం గురించి అప్పటి ట్వీట్‌లో ఆయన రాసుకొచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు బడ్జెట్ సెషన్‌లో మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన "ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ'



పుస్తకం హాట్ టాపిక్‌గా మారింది. దీనిలోని పలు అంశాలను ప్రస్తావిస్తూ లోక్‌సభలో మాట్లాడేందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రయత్నించారు. అయితే అందుకు లోక్‌సభ స్పీకర్ అనుమతించలేదు. ఎంఎం నరవణె పుస్తకంలోని అంశాలపై సభలో మాట్లాడటానికి వీలు లేదన్నారు.ఎంఎం నరవణె పుస్తకంలో ఏముంది ?రాహుల్ గాంధీ తాజాగా చేసిన వ్యాఖ్యల ప్రకారం, మాజీ ఆర్మీ చీఫ్ నరవణె రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం విదేశాల్లో పబ్లిష్ అయింది. ఈ బుక్ 2024 ఏప్రిల్‌లోనే భారత్‌లో విడుదల కావాల్సి ఉండగా, దానికి భారత రక్షణ శాఖ ఆమోదం లభించలేదన్నారు. దీంతో ఈ బుక్?ను పెంగ్విన్ పబ్లిషర్స్ సంస్థ మన దేశంలో అధికారికంగా పబ్లిష్ చేయలేదని రాహుల్ చెప్పారు. 2020లో తూర్పు లద్దాఖ్ సరిహద్దుల్లోకి చైనా యుద్ధ ట్యాంకులు ప్రవేశిస్తున్నాయని, తాము ఏం చేయాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎన్ఎస్ఏ అజిత్ దోవల్‌లను అప్పటి ఆర్మీ చీఫ్ నరవణె సంప్రదించారన్నారు.కానీ ఆయనకు నేరుగా సమాధానం లభించలేదని రాహుల్ పేర్కొన్నారు. దీంతో ప్రధాని మోదీని ఎంఎం నరవణె సంప్రదించగా, 'మీకు ఏది కరెక్ట్ అనిపిస్తే, అది చేయండి' అని మోదీ చెప్పారన్నారు. మొత్తం బాధ్యతనంతా తనపైనే వేసి, ప్రభుత్వంలోని పెద్దలు తప్పించుకోవడంతో ఆనాడు తాను పూర్తిగా ఒంటరి అయ్యాను అనే అంశాన్ని పుస్తకంలో నరవణె రాసుకున్నారని రాహుల్ గాంధీ వివరించారు.ఏమిటీ 'హెండెర్సన్ బ్రూక్స్ – భగత్' నివేదిక థామస్ బ్రియాన్ హెండెర్సన్ బ్రూక్స్ 1909లో బర్మాలో జన్మించారు. ఈయన 1929 నుంచి 1947 వరకు భారత్‌లోని బ్రిటీష్ ప్రభుత్వ ఆర్మీలో అధికారిగా పనిచేశారు. దేశానికి బ్రిటీష్ వాళ్ల నుంచి స్వాతంత్ర్యం వచ్చాక, భారత ఆర్మీలోనూ ఆఫీసరుగా పనిచేశారు. 1947 నుంచి 1964 వరకు భారత ఆర్మీలో జనరల్ ఆఫీసర్ హోదాలో సేవలు అందించారు. భారత ఆర్మీ బ్రిగేడియర్ పీఎస్ భగత్, థామస్ బ్రియాన్ హెండెర్సన్ బ్రూక్స్‌లతో కూడిన దర్యాప్తు టీమ్ 1962 భారత్ – చైనా యుద్ధంపై సమీక్షా నివేదికను రూపొందించింది. దీన్నే 'హెండెర్సన్ బ్రూక్స్ – భగత్' నివేదిక అంటారు.

# దళపతి విజయ్‌కి షాక్ ఇచ్చిన కోర్టు ఆ పిటిషన్ కొట్టివేత

చెన్నై, ఫిబ్రవరి 6: తమిళ స్టార్ హీరో, తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీ అధినేత దళపతి విజయ్‌కి మద్రాస్ హైకోర్టు షాక్ ఇచ్చింది. విజయ్ వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఆదాయ పన్ను పెనాల్టీకి సంబంధించి విజయ్ వేసిన రిట్ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్ కుమార్ శుక్రవారం విచారణ జరిపారు. ఆదాయ పన్ను శాఖకు అనుకూలంగా తీర్పునిచ్చారు. విజయ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇంతకీ ఏం





జరిగిందంటే..2015 సంవత్సరంలో ఆదాయ పన్ను శాఖ అధికారులు విజయ్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. దళపతి విజయ్‌కి మద్రాస్ హైకోర్టు షాక్ ఇచ్చింది. విజయ్ వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. విజయ్ వేసిన రిట్ పిటిషన్‌పై జస్టిస్ సెంథిల్ కుమార్ శుక్రవారం విచారణ జరిపారు. ఆదాయ పన్ను శాఖకు అనుకూలంగా తీర్పునిచ్చారు.పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని నెలల తర్వాత విజయ్ ఆదాయ పన్ను రిటర్న్ ఫైల్ చేస్తూ.. 2015–16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తనకు 35.42 కోట్ల రూపాయలు ఆదాయం వచ్చినట్లు చూపించారు. అయితే పులి సినిమా కోసం ఆయన తీసుకున్న 15 కోట్ల రూపాయలు ఆ లెక్కలో చూపించలేదని అధికారులు గుర్తించారు. 1.5 కోట్ల రూపాయల పెనాల్టీ వేస్తూ 2022 జూన్ 30వ తేదీన నోటీసులు ఇచ్చారు.ఆదాయ పన్ను శాఖ అధికారుల నోటీసులకు వ్యతిరేకంగా విజయ్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టులో రిట్ పిటిషన్ వేశారు. సింగిల్ జడ్జి ఈ పిటిషన్‌పై విచారణ జరిపారు. ఆదాయ పన్ను శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా 2022 ఆగస్టు 16న ఇంటీరియమ్ స్టే వేశారు. శుక్రవారం ఈ పిటిషన్‌పై మరోసారి విచారణ జరిగింది. జస్టిస్ సెంథిల్ కుమార్.. విజయ్ వేసిన పిటిషన్‌ను కొట్టి వేశారు.

# న్యాయవేదికను ప్రచారానికి వాడుకుంటున్నారా

న్యూఢిల్లీ: గత ఏడాది నవంబర్‌లో జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను సవాలు చేస్తూ జన్ సురాజ్ (పార్టీ చీఫ్ ప్రశాంత్ కిశోర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారంనాడు కొట్టివేసింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది.అసెంబ్లీ ఎన్నికల్లో అధికార జనతా దళ్ (యునైటెడ్), భారతీయ జనతా పార్టీ కూటమి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిందని ప్రశాంత్ కిశోర్ తమ పిటిషన్‌లో ఆరోపించారు. ఓటింగ్‌కు ముందు మహిళా ఉపాధి పథకం కింద లబ్ధిదారులైన ఒక్కో మహిళకు రూ.10 వేలు పంపిణీ చేశారని, ఇది ఎన్నికల ఫలితాన్ని ప్రభావితం చేసిందని అన్నారు. కూటమి గెలుపు చెల్లదని ప్రకటించాల్సిందిగా కోర్టును కోరారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి పోటీ చేసిన జన్‌సురాజ్ పార్టీ 238 స్థానాల్లో ఒక్క సీటును కూడా గెలుచుకోలేదు. కాగా, ప్రశాంత్ కిశోర్ పిటిషన్‌పై



విచారణకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని ధర్మాసనం నిరాకరించింది. 'మీ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయి? ప్రజలే మీ పార్టీని వద్దనుకున్నారు. ఇప్పుడు ప్రచారం కోసం ఈ న్యాయవేదికను వాడుకోవాలనుకుంటున్నారా?' అని సీజేఐ ప్రశ్నించారు.ఎన్నికల్లో ఓడిపోయినందున మొత్తం ఫలితాన్ని పక్కన పెట్టాలని మీరు కోరుతున్నారని, దీనిపై హైకోర్టుకు ఎందుకు వెళ్లలేదని ప్రశాంత్ కిషోర్ న్యాయవాదులను ధర్మాసనం నిలదీసింది. 'ఇదేమీ పాన్–ఇండియా అంశం కాదు. మీ రాష్ట్రంలో హైకోర్టు ఉంది. ఏమైనా ఫిర్యాదులు ఉంటే అక్కడికి వెళ్లండి' అని స్పష్టం చేసింది.

# గడ్చిరోలిలో కాల్పుల కలకలం ముగ్గురు మావోయిస్టుల మృతి



మహారాష్ట్ర – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీస్ భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పులు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. గడ్చిరోలి అడవుల్లో జరిగిన ఈ కాల్పుల ఘటనలో భారీ నష్టం వాటిల్లింది. అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయని ఇంటెలిజెన్స్ సమాచారం అందడంతో.. పోలీసులు, భద్రతా బలగాలు నిన్నటి(గురువారం) నుంచి గాలింపు చర్యలు చేపట్టాయి. భద్రతా బలగాలు అడవిలోకి ప్రవేశించగానే మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు మొదలయ్యాయి. ప్రతిగా బలగాలు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు. ఈ హోరాహోరీ పోరులో కమాండో దీపక్ ప్రాణాలు కోల్పోగా, గాయపడిన మరో అధికారిని మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలిలో ఏకే–47, స్వా= స్వాధీనం చేసుకున్నాయి భద్రతా బలగాలు.కొనసాగుతున్న ఆపరేషన్..ఘటనా స్థలంలో పోలీసులు.. ఆయుధాలు, విప్లవ సాహిత్యం, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆ ప్రాంతంలో ఇంకా కొందరు మావోయిస్టులు దాగిఉండే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌తో గడ్చిరోలి జిల్లాలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. స్థానికులను అప్రమత్తం చేసిన అధికారులు.. అటవీ ప్రాంతాల వైపు వెళ్లవద్దని సూచనలు జారీ చేశారు. ఎన్‌కౌంటర్ పూర్తైన తర్వాత మృతుల సంఖ్య, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

# మోదీ మాట్లాడకపోవడం నిబంధనలకు విరుద్ధం- సభకు వివరించాల్సిందే'- స్పీకర్‌కు కాంగ్రెస్ లేఖ

న్యూఢిల్లీ: లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ ముగింపు సందర్భంగా అనుసరించాల్సిన విధానాలు పాటించలేదని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ అంశంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఆయన లేఖ రాస్తూ, జరిగిన పరిణామాలను సభకు స్పష్టంగా వివరించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమాధానం లేకుండానే ధన్యవాద తీర్మానాన్ని ఆమోదించడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమని పేర్కొన్నారు.పలు నియమాలను ప్రస్తావించిన వేణుగోపాల్ గురువారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ జరిగింది. అయితే ప్రతిపక్షాల ఆందోళనలు, నినాదాల మధ్య ప్రధానమంత్రి ప్రసంగం చేయకుండానే తీర్మానాన్ని ఓటింగ్‌కు పెట్టి ఆమోదించడం అసాధారణ పరిణామంగా మారింది. ఇది ఇప్పటివరకు అరుదుగా జరిగిన సంఘటనగా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో స్పీకర్‌కు రాసిన లేఖలో వేణుగోపాల్ పలు నియమాలను ప్రస్తావించారు.సభకు తెలియజేయాల్సిన బాధ్యత ఆయనదే!లోక్‌సభ నియమావళి ప్రకారం రూల్ 20 కింద ధన్యవాద తీర్మానంపై చర్చ ముగింపులో ప్రభుత్వ వైఖరిని ప్రధానమంత్రి స్వయంగా వివరణ ఇవ్వడం తప్పనిసరి అని తెలిపారు. ఏదైనా కారణంతో ప్రధాని సమాధానం ఇవ్వలేకపోతే, ఆ విషయాన్ని సభకు తెలియజేయాల్సిన బాధ్యత ఆయనదేనని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత సందర్భంలో ప్రధాని ప్రసంగం లేకపోవడమే కాకుండా, సభకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని విమర్శించారు. ఇది రూల్ 20 స్పష్టమైన ఉల్లంఘనగా



పేర్కొన్నారు.రూల్ 362 ప్రకారం ప్రత్యేక తీర్మానం తీసుకురావాలి!అదేవిధంగా, సాధారణంగా చర్చ ముగింపులో సంబంధిత మంత్రి సమాధానం ఇవ్వడం పార్లమెంటరీ పద్ధతి అని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో సమాధానం లేకుండానే చర్చ ముగించాలంటే రూల్ 362 ప్రకారం ప్రత్యేక తీర్మానం తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. ఆ తీర్మానాన్ని స్పీకర్ సభ ముందుంచి ఆమోదం పొందిన తర్వాతే చర్చ ముగిసినట్లు పరిగణించాలన్నారు.సభ్యుల మాట స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యతకానీ గురువారం జరిగిన ప్రక్రియలో అలాంటి తీర్మాం ఏదీ తీసుకురాలేదని, అయినప్పటికీ మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో హఠాత్తుగా ధన్యవాద తీర్మానాన్ని ఓటింగ్‌కు పెట్టి ఆమోదించారని వేణుగోపాల్ ఆక్షేపించారు. ఇది రూల్ 362కు కూడా విరుద్ధమని పేర్కొన్నారు. స్పీకర్ రాజ్యాంగబద్ధంగా సభా నియమాల సంరక్షకుడని, సభ్యుల మాట స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ఆయనదని వేణుగోపాల్ లేఖలో గుర్తుచేశారు.ఆ ప్రశ్నలకు స్పష్టతనివ్వాలని కోరిన ఎంపీరాజ్యాంగంలోని ఆర్టికల్ 105 సభ్యులకు మాట్లాడే హక్కును ఇస్తుందని, ఆ హక్కు పూర్తిగా వినియోగించుకునేలా చూడటం స్పీకర్ ధర్మమని పేర్కొన్నారు. అలాగే ఆర్టికల్ 75(3) ప్రకారం ప్రధానమంత్రి ప్రభుత్వ తరపున సభకు బాధ్యత వహించాల్సిన రాజ్యాంగ బాధ్యత ఉందన్నారు. "ప్రధానమంత్రి సమాధానం ఎందుకు లేకపోయింది? చర్చను ఎలాంటి విధానంతో ముగించారు? ఏ నియమాల ప్రకారం తీర్మానాన్ని ఓటింగ్‌కు పెట్టారు?" వంటి ప్రశ్నలకు స్పష్టత ఇవ్వాలని ఆయన స్పీకర్‌ను కోరారు. సంబంధిత నియమాలు, అనుసరించిన విధానం గురించి సభకు వివరాలు తెలియజేస్తే సభ్యులకు స్పష్టత వస్తుందని అన్నారు.కాగా, ప్రధాని ప్రసంగం లేకుండానే రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం లోక్‌సభలో ఆమోదం పొందింది. అయితే ప్రధాని కూర్చున్న చోటకు వచ్చి కాంగ్రెస్ ఎంపీలు అనూహ్య చర్యకు పాల్పడతారనే కచ్చితమైన సమాచారం ఉందని, అందుకే గురువారం ఆయనను సభకు రావొద్దని తానే సూచించానని స్పీకర్ ఓం బిర్లా ఇప్పటికే తెలిపారు. ఒకవేళ అలాంటి ఘటన జరిగితే దేశ ప్రజాస్వామ్య సంప్రదాయానికి తీవ్ర విఘాతం కలిగేదని స్పష్టం చేశారు. "బుధవారం సభలో కొందరు సభ్యుల ప్రవర్తన సరిగా లేదు. ఇలాంటి పరిస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదు. ఇది ఎంతో బాధాకరం. మాయని మచ్చ" అని ఓం బిర్లా వ్యాఖ్యానించారు. తన సూచనను గౌరవించి ప్రధాని సభకు రాకుండా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# లోక్‌సభలో కొనసాగిన గందరగోళం సోమవారానికి వాయిదా

న్యూఢిల్లీ: లోక్‌సభ లో గందరగోళం కూడా కొనసాగింది. రాజ్యసభ లో గురువారం ప్రధాని మోదీ మాట్లా డుతూ చేసిన విమర్శలపై విపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. లోక్‌సభలో తమ నాయకుడికి మాట్లాడే అవకాశం ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. పలువురు సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరే కంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. స్పీకర్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినిపించుకోకపోవడంతో సభను సోమవారానికి వాయిదా వేశారు. లోక్‌సభలో ఈ బడ్జెట్ సెషన్‌లో ఇప్పటికే 19



గంటల 13 నిమిషాల సమయం వృథా అయ్యిందని స్పీకర్ తెలిపారు. సభను సోమవారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటిం చారు. కాగా పార్లమెంట్‌లో తొలి విడత బడ్జెట్ సమావేశాలు ఈ నెల 13తో ముగియనున్నాయి. మార్చి 9న రెండో విడత సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 9 నుంచి లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చ జరుగనుంది.

# 'మీకు ఏది సరైనదనిపిస్తే అదే చేయండి'- మోదీ ప్రసంగంపై రాహుల్ సెటైర్

న్యూఢిల్లీ: రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంపై కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. జో ఉచిత్ సమ్జో వహీ కరో (మీరు సరైనది అనుకున్నది చేయండి) అంటూ వ్యంగ్యంగా విమర్శించారు. పార్లమెంట్‌మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం ఉదయం చేపట్టిన నిరసనలో పాల్గొన్న రాహుల్, ఈ మేరకు పలు వ్యాఖ్యలు చేశారు.శుక్రవారం ఉదయం పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జో ఉచిత్ సమ్జో వహీ కరో అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన కొనసాగించారు. భారత్?, అమెరికా డీల్?ను ట్రాప్ డీల్‌గా వర్ణిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆ సమయంలో వారితోపాటు రాహుల్ గాంధీ కూడా పాల్గొని నినాదాలు చేశారు. అప్పుడే మీడియాతో మాట్లాడుతూ, జో ఉచిత్ సమ్జో వహీ కరో అంటూ విమర్శించారు.అదే సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా మోదీ ప్రసంగం తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందని, ప్రతిపక్షం లేవనెత్తిన కీలక అంశాలకు ప్రధాని సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారని ఆరోపించారు. ప్రధాని ప్రసంగ సమయంలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ వాకౌట్ చేసిన విషయం తెలిసిందే. జాతీయ భద్రత, చైనా అంశాలపై తమ ఆందోళనలకు





సరైన సమాధానం రాలేదనే కారణంతో సభను బహిష్కరించామని ఖర్గే తెలిపారు."ప్రధాని ప్రసంగానికి స్పందించాల్సిన అవసరం లేదు. కానీ ఆయన చెప్పిన అసత్యాలకు సమాధానం ఇవ్వాల్సి వస్తోంది. అబద్ధాలను పదేపదే చెప్పడం ఆయన అలవాటైపోయింది" అని ఖర్గే విమర్శించారు. 97 నిమిషాల ప్రసంగంలో ప్రధాని గత 100 ఏళ్లు, 75 ఏళ్లు, 50 ఏళ్ల చరిత్ర గురించి మాత్రమే మాట్లాడారని, కానీ ప్రస్తుత సమస్యలపై స్పష్టత ఇవ్వలేదన్నారు. మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎం.ఎం. నరవాణే రాసిన స్మృతిగ్రంథం (మెమోయర్) అంశాన్ని ప్రస్తావిస్తూ ఎందుకు ఇబ్బందిపడింది?"ఆ పుస్తకం ఇప్పటికే ప్రచురితమై మా చేతుల్లో ఉంది. అయితే అది ప్రచురించలేదని రక్షణ మంత్రి మెంట్‌లో ఎలా చెబుతారు? ఇది మీ కళ్ల ముందే ఉన్న విషయం" అంటూ ప్రశ్నించారు. హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా అదే విషయాన్ని పునరావృతం చేశారని, చివరికి రాహుల్ గాంధీ సభలో పుస్తకాన్ని చూపించిన తర్వాత నిజం బయటపడిందన్నారు. అలాగే లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చైనా అంశాన్ని లేవనెత్తినప్పుడు ప్రభుత్వం ఎందుకు ఇబ్బందిపడిందని ఖర్గే ప్రశ్నించారు."నిజం వినండి, సమాధానం ఇవ్వండి. లేదంటే ఖండించండి" అని వ్యాఖ్యానించారు. ప్రధాని ప్రసంగంలో విషయపరమైన సమాధానాలు లేకపోవడంతోనే ప్రతిపక్షం వాకౌట్ చేసినట్లు చెప్పారు. "మేం లేవనెత్తిన సమస్యలకు ఆయన దగ్గర సమాధానం లేదు. తర్వాత మాపై విమర్శలు చేయడమేంచామన్న ఆరోపణలను కూడా ఖర్గే ఖండించారు. "సిక్కు సమాజాన్ని మేం గౌరవిస్తాం. డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశానికి రెండుసార్లు ప్రధానిగా సేవలందించారు" అని గుర్తుచేశారు. గత 10 ఏళ్లుగా కాంగ్రెస్‌పై విమర్శలు చేయడమే తప్ప ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టలేదని ఖర్గే ఆరోపించారు.అదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్? కూడా ప్రధాని ప్రసంగంపై తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యసభలో ప్రతిపక్షం లేవనెత్తిన కీలక అంశాలకు ప్రధాని సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు.

# విదేశాల నుంచి 23 వేల మంది భారతీయుల బహిష్కరణ. 2025 గణాంకాలు విడుదల

దుబాయ్ :తమ దేశంలో ఉంటూ, నిబంధనలు పాటించని విదేశీయుల్ని ఆయా దేశాలు బహిష్కరించడం సహజమే. అలాగే విదేశాల్లో ఉంటున్న భారతీయుల్ని కూడా అక్కడి నిబంధనలు పాటించకుంటే బహిష్కరించి, తిరిగి పంపిస్తారు. ఇలా గతేడాది ఏకంగా వివిధ దేశాల నుంచి 22,900 మంది భారతీయుల్ని ప్రపంచ దేశాలు బహిష్కరించాయి. దీనికి సంబంధించి కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ తాజాగా పార్లమెంట్‌లో ఒక నివేదిక విడుదల చేసింది.2025లో విదేశాల నుంచి 22,900 మంది భారతీయులు బహిష్కరణకు గురైనట్లు కేంద్రం వెల్లడించింది. అయితే, ఎక్కువ మంది అనుకునేటట్లు ఇండియన్స్‌ను ఎక్కువగా తిరిగి పంపించిన దేశం అమెరికా కాదు. సౌదీ అరేబియా నుంచి ఎక్కువ మంది ఇండియన్స్ గతేడాది బహిష్కరణకు గురయ్యారు. ఇందులో జెద్దా నుంచి ఏకంగా 8,921 మంది, జెద్దా నుంచి 4,335 మంది ఒక్క ఏడాదిలోనే బహిష్కరణకు గురై తిరిగి ఇండియాకు వచ్చేశారు. ఆ తర్వాత యూఏఈ నుంచి ఎక్కువ మందిని బహిష్కరించారు. వీరిలో 7,896 మంది భారతీయులు దుబాయ్ నుంచి, 1,662 మంది అబుదాబి నుంచి డిపోర్ట్ అయ్యారు. ఎక్కువ మంది డ్రీమ్ కంట్రీ అమెరికా నుంచి గతేడాది 3,806 మంది భారతీయులు బహిష్కరణకు గురయ్యారు. ఆ తర్వాతి స్థానాల్లో మలేసియా నుంచి 1,675 మంది, మయన్మార్ నుంచి 1,065 మంది, సింగపూర్ నుంచి 300 మంది, మాల్దీవ్స్ నుంచి 150 మంది, యూకే నుంచి 70 మంది భారతీయులు బహిష్కరణకు గురయ్యారు.

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# చిమ్మచీకటిలో అద్భుత ఫొటో- సింగిల్ ఫ్రేమ్‌లో గురుగ్రహం, ఆకాశ కాంతి, లద్ధాఖ్ సరస్సు- ఒక్క ఫొటో కోసం అలుపెరగని జర్నీ



ఎముకలు కొరికే చలి, మంచురాశులతో గడ్డకట్టిన సరస్సు, చుట్టూ చిమ్మచీకటి వీటన్నింటి నడుమ ఒక అద్భుతమైన 360 డిగ్రీస్ ఫొటోను క్లిక్ మనిపించారు. ఒకే ఒక్క ఫ్రేమ్‌లో మిలమిలా మెరుస్తున్న గురు గ్రహం, దాని వైపుగా ప్రసరిస్తున్న తెలుపు రంగు ఆకాశ కాంతిరేఖ, గడ్డకట్టిన 'చిల్లింగ్ త్సో' సరస్సును కళ్లకు కట్టేలా చూపించడం ఈ ఫొటో ప్రత్యేకత. దీన్ని చూసిన వారు, ఇది చీకటిలో తీసిన ఫొటో అంటే అస్సలు నమ్మ లేకపోతున్నారు. రాత్రి టైంలో కేవలం నక్షత్రాలు, చంద్రుడి సహజ కాంతిలో ఈ ఫొటోను ఆస్ట్రో ఫొటోగ్రాఫర్ డోర్జే ఆంగ్చుక్ తీశారు. కేంద్ర పాలిత ప్రాంతం లద్ధాఖ్‌లోని లేహ్ జిల్లా హాన్లే గ్రామంలో ఉన్న ఇండియన్ ఆస్ట్రోనామికల్ అబ్జర్వేటరీ(ఐఏఓ)లో ఇంఛార్జి ఇంజినీర్‌గా ఆయన వ్యవహరిస్తున్నారు. 'చిల్లింగ్ త్సో' సరస్సు విషయానికొస్తే, ఇది సముద్ర మట్టానికి 5వేల మీటర్ల ఎత్తులో ఉంటుంది. వణికించే చలిని ఎదుర్కొంటూ, గడ్డకట్టిన సరస్సుపై నిలబడి, ఎలాంటి లైటింగ్ ఎఫెక్ట్స్ లేకుండా ఒక్క ఫొటోను తీయడానికి తాము పడిన శ్రమను 'ఈటీవీ భారత్'కు ఆస్ట్రో ఫొటోగ్రాఫర్ డోర్జే ఆంగ్చుక్ వివరించారు.

ఇద్దరం కాస్తా ముగ్గురం అయ్యాం"భారతదేశంలో మొట్టమొదటి డార్క్ స్కై రిజర్వ్ లద్ధాఖ్‌లోని హాన్లే గ్రామం పరిధిలోనే ఉంది. అంటే ఆ ప్రాంతాన్ని వీధి దీపాలు, వాహన దీపాల కాంతి కాలుష్యం నుంచి ప్రభుత్వ యంత్రాంగం కాపాడుతుంది. అలాంటి చోట రాత్రి వేళ సహజ కాంతిలో గ్రహాలు, నక్షత్రాలు, ఆకాశం ఫొటోలను తీస్తే ఆ మజాయే వేరు. నేను హాన్లే గ్రామంలోని ఇండియన్ ఆస్ట్రోనామికల్ అబ్జర్వేటరీ(ఐఏఓ)లో ఇంఛార్జి ఇంజినీర్‌గా పనిచేస్తున్నాను. ఈ ఊరికి 58 కి.మీ దూరంలో 'చిల్లింగ్ త్సో' సరస్సు ఉంది. దాదాపు 1 గంట 40 నిమిషాల్లో అక్కడికి చేరుకోవచ్చు. 2025 ఆగస్టు 15న ఆ సరస్సు వద్దకు వెళ్లొచ్చాను. అది వేసవి సీజన్ అయినా, మేం తీసుకెళ్లిన మూడు వెహికల్స్‌లో రెండు మంచులో దిగబడ్డాయి. ఈ ఏడాది జనవరి నెలలో చలికాలం. సరస్సు దగ్గర పరిస్థితులు మరింత ప్రతికూలంగా ఉంటాయి. ఇవన్నీ తెలిసినా నేను సాహసించాను. నేను, మరో వ్యక్తి కలిసి 2026 జనవరి 10న మధ్యాహ్నం హాన్లే గ్రామం నుంచి 'చిల్లింగ్ త్సో' సరస్సు వద్దకు బయలుదేరాం. హాన్లే గ్రామానికి చెందిన ఓ మిత్రుడిని కలిసి, మేమిద్దరం అర్ధరాత్రికల్లా తిరిగి రాకుంటే రెస్క్యూ టీమ్‌లను సరస్సు దగ్గరికి పంపమని కోరాం. అది విన్న ఆ మిత్రుడు కూడా మా వెంట బయలుదేరాడు. దీంతో మా ధైర్యం మరింత పెరిగింది" అని డోర్జే ఆంగ్చుక్ పేర్కొన్నారు.ఎక్స్‌ట్రా కెమెరాలు, ట్రైపాడ్‌లు, దుస్తులతో రంగంలోకి"మేం జనవరి 10న సాయంత్రం 4:30 గంటలకు 'చిల్లింగ్ త్సో' సరస్సు వద్దకు చేరుకున్నాం. లద్ధాఖ్‌లోని మిగతా సరస్సుల నీటిలో కొంత ఉప్పు మోతాదు ఉంటుంది. అందువల్ల అవి మంచుతో గడ్డకట్టినప్పుడు, కింద ఏముందో కనిపించదు. కానీ 'చిల్లింగ్ త్సో' సరస్సు గడ్డకడితే, దాని మంచురాశుల కింద ఏముందో స్పష్టంగా కనిపిస్తుంది. మేం కాళ్లు పెట్టగానే, లోపలికి కుంగిపోతాయి అనేలా అత్యంత సున్నితంగా సరస్సులోని మంచురాశులు ఉన్నాయి. అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని వాటిపై చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తూ ముందుకు సాగాం. చిమ్మచీకటి నడుమ ఆకాశంలో మెరుస్తున్న గురు గ్రహం ఫొటోలను తీసేందుకు మేం మూడు కెమెరాలు, మూడు ట్రైపాడ్ స్టాండ్లను తీసుకెళ్లాం. ఒకవేళ వీటిలో ఏదైనా ఒకటి సరస్సులో పడిపోయినా, ఇంకోటి వాడేందుకే ఈ ముందుజాగ్రత్త ఏర్పాట్లు చేసుకున్నాం. అత్యవసర పరిస్థితిలో ధరించడానికీ అదనంగా మరో జత దుస్తులనూ మేం తీసుకెళ్లాం. గ్రహాల ఫొటోలు తీసేందుకు అనువైన 'ఐ ఆప్ట్రాన్ స్కై గైడర్ ప్రో' కెమెరాలు మా చేతిలో ఉన్నాయి. కానీ ఒకవేళ ఏదైనా జరగరానిది జరిగితే, ఈ శ్రమ అంతా వేస్ట్ అవుతుందనే ఆందోళన మమ్మల్ని వెంటాడింది. తీవ్రమైన చలికి మా చేతి వేళ్లు మొద్దుబారాయి" డోర్జే ఆంగ్చుక్ వివరించారు.ఆ ఫొటోలో ఏమేం కవర్ అయ్యాయో తెలుసా?"ఎట్టకేలకు మంచుతో గడ్డకట్టిన 'చిల్లింగ్ త్సో' సరస్సుపై ట్రైపాడ్ స్టాండ్‌లను పెట్టి వాటికి 'ఐ ఆప్ట్రాన్ స్కై గైడర్ ప్రో' కెమెరాలను బిగించాం. ఈ కెమెరాలు ఒక్క క్లిక్‌లోనే వరుసగా 21 ఫొటోలను అన్ని యాంగిల్స్‌లో తీయగలవు. ఈ ఫొటోలు హై రెజల్యూషన్‌లో, 360 డిగ్రీలలో చూసేందుకు అనువుగా ఉంటాయి. ఈవిధంగా ఫొటో తీసే టెక్నిక్‌ను '21 వన్ మినట్ ట్రాక్‌డ్ ప్యానల్స్' అంటారు. చివరకు మేం ఈ టెక్నిక్‌తో ఫొటోను క్లిక్ మనిపించాం. వచ్చిన ఫొటోను చూసి చాలా సంతోషం కలిగింది. నీలి ఆకాశంలో తళతళా మెరిసిపోతున్న గురుగ్రహం, దానిపై ప్రసరిస్తున్న తెలుపు రంగు ఆకాశ కాంతిరేఖ, గగనవీధిలో చిన్నచిన్న నక్షత్రాలు, మంచుతో గడ్డకట్టిన 'చిల్లింగ్ త్సో' సరస్సు అన్నీ ఆ ఫొటోలో మాకు కనిపించాయి. ప్రత్యేకించి గురుగ్రహంపై తెలుపు రంగు ఆకాశ కాంతిరేఖ ప్రసరించే విజువల్ కూడా మా కెమెరాకు చిక్కడం నాకు చెప్పలేనంత ఆనందాన్ని ఇచ్చింది" అని డోర్జే ఆంగ్చుక్ తెలిపారు.కాంతి కాలుష్యం వల్ల మనం చాలా కోల్పోతున్నాం"మన పూర్వీకులు గ్రహాలు, నక్షత్రాల లాంటి ఖగోళ శాస్త్ర అంశాలను జీవితంలో ఒక భాగంగా భావించే వారు. వాళ్లు రోజూ రాత్రివేళ ఆకాశాన్ని నిశితంగా చూసేవారు. ఈతరం వారికి ఆ తీరిక ఉండటం లేదు. ఆకాశం అనేది కూడా ఒక సహజ వనరు. దాన్ని కాంతి కాలుష్యం నుంచి మనం కాపాడుకోవాలి. కాంతి కాలుష్యం వల్ల రాత్రివేళ ఆకాశపు స్వచ్ఛత దెబ్బతింటుంది. కాంతి కాలుష్యం కారణంగా మనం ఏమేం కోల్పోతున్నామో ప్రజలకు చూపించాలి అనేది నా లక్ష్యం. అందుకోసమే ఇప్పుడీ ఫొటోను తీశాను. భూమిని, నక్షత్రాలను ఒకే ఫ్రేమ్‌లో క్లిక్ మనిపించడం నాకు గొప్ప సంతృప్తిని ఇచ్చింది" అని డోర్జే ఆంగ్చుక్ చెప్పారు.ఆంగ్చుక్ ఫొటోలు చూస్తే ఖగోళ శాస్త్రం అర్థమైపోతుంది"ఖగోళ శాస్త్రాన్ని, సమాజాన్ని అనుసంధానించేందుకు బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ) ప్రయత్నిస్తోంది. మేం సంక్లిష్టమైన ఖగోళ పరిశోధనల వివరాలను సరళంగా ప్రజలకు తెలియజేస్తున్నాం. సైన్సు అంటే పాఠ్యపుస్తకాలు, ప్రయోగశాలలు మాత్రమే అని మనం అనుకుంటున్నాం. ఇలా అనుకోవడం పెద్ద మైనస్ పాయింట్. కళలు, సినిమాలు, క్రీడలలాగే ప్రజలకు, విద్యార్థులకు సైన్సుపైనా అవగాహన కల్పించాలి. దాన్ని మన సంస్కృతిలో భాగంగా చేసుకోవాలి. ఖగోళ శాస్త్రవేత్తలు ఆకాశాన్ని చూసినప్పుడు ఖగోళ పరిణామాలను గమనిస్తారు. కళాకారులు ఆకాశ వీధిలో జరిగిన మార్పులను, తాజా కూర్పులను నిశితంగా చూస్తారు. పర్యావరణవేత్తలు మంచు, ప్రకృతి దృశ్యం వంటివి చూసి విశ్లేషణలు చేయడం మొదలుపెడతారు. డోర్జే ఆంగ్చుక్ లాంటి ఔత్సాహిక ఆస్ట్రో ఫొటోగ్రాఫర్లు తీస్తున్న అద్భుత ఫొటోలను చూస్తే, సంక్లిష్ట ఖగోళ శాస్త్రం కూడా అవలీలగా సామాన్య ప్రజలకు అర్థమైపోతుంది" అని బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ) సైన్స్ కమ్యూనికేషన్ విభాగం అధిపతి నిరుజ్ మోహన్ రామానుజం 'ఈటీవీ భారత్'కు చెప్పారు.

# దాంపత్య బంధంలో గ్యాప్ రావద్దంటే- ఈ టిప్స్ పాటించాలంటున్న నిపుణులు!



ప్రేమ, దాంపత్య బంధాలు మొదట్లో బాగానే ఉంటాయి. కానీ, కాలం గడుస్తున్నకొద్దీ.. భాగస్వామి ప్రవర్తనలో వచ్చే మార్పులు, లక్షణాలు ఇద్దరి మధ్యా మనస్పర్థలు తీసుకొస్తాయి. క్రమంగా వాళ్ల మధ్య దూరాన్ని పెంచుతాయి. అప్రమత్తం కాకపోతే విడిపోయే వరకు తీసుకెళ్తాయని హెచ్చరిస్తున్నారు రిలేషన్‌షిప్ ఎక్స్‌పర్ట్స్. మరి, అలా జరగకుండా ఉండాలంటే ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం!

పక్కదోవ పట్టనివ్వొద్దు : సంసార బంధంలో గొడవలు సాధారణమే. అలా జరిగినప్పుడు సమస్య ఏదో దాని గురించి మాత్రం మాట్లాడితే సరిపోతుందంటున్నారు నిపుణులు. అలాకాకుండా అనవసరంగా అరవడం, ఎప్పటి విషయాలో తెచ్చి నిందించడం మొదలుపెడితే అది పక్కదారి పడుతుందని చెబుతున్నారు. దీంతో అది మరింత ముదిరిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అందుకే, వాదన మొదలైతే, ఇద్దరిలో ఒక్కరైనా కోపాన్ని అదుపులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. అలాకాకుండా, ఒకరి కంటే మరొకరు ఎక్కువ కోపాన్ని ప్రదర్శిస్తే... ఇంటి వాతావరణమే మారిపోతుందని అంటున్నారు. అది మానసికంగా మిగతావారిపై ఒత్తిడినీ పెంచుతుందని చెబుతున్నారు. ఏదైనా భేదాభిప్రాయం వస్తే కొంతసేపు నిశ్శబ్దంగా ఉండి, అక్కడి నుంచి బాల్కనీ లేదా తోటలో పది నిమిషాల పాటు నడవడం నేర్చుకోవాలని సలహా ఇస్తున్నారు. మనసు కుదుటపడిన తరువాతే లోపలికి రావాలని అంటున్నారు. ఆ తరువాత ఇద్దరూ కూర్చుని మాట్లాడుకుంటే అసలు సమస్యకు కారణమేంటో తెలుస్తుందని తెలియజేస్తున్నారు.భాగస్వామికి ఆ భరోసా - ఇస్తే చాలంటున్న నిపుణులు!దూరంగా వెళ్లండి : ఒక్కటిగా నడవాల్సిన చోట.. ఎవరికివారు తామే గొప్ప అన్నట్లు వ్యవహరిస్తే ఆ బంధం ప్రమాదంలో పడుతుంది. ఈ క్రమంలో ఒక ఇంట్లోనే కలిసున్నా, అన్నీ మనకు నచ్చినట్లేజరగాలను ోవడం పొరపాటు. ఎవరు పెరిగిన వాతావరణాన్ని బట్టి వారి అలవాట్లు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. వాటిని ఇద్దరూ గౌరవించుకొని, సర్దుకుపోవాలని సూచిస్తున్నారు. అలాకాకుండా, మీరు చెప్పినట్లు చేయడం లేదని నీకు మీ ఇంట్లోవాళ్లు ఇంతే నేర్పారా? ఒక్కపనీ రాదా? అంటూ చిన్న చిన్న పనులకు కూడా గట్టిగా అరవడం, కోప్పడటం, నలుగురిలోనూ నిందించడం కూడదని తెలియజేస్తున్నారు. బదులుగా, ఆ పనిని ఇలా చేస్తే బాగుంటుందని, మీకు నచ్చుతుందని చెప్పి చూడాలని తెలియజేస్తున్నారు. దీంతో వాళ్లు అర్థం చేసుకుంటారని చెబుతున్నారు.ఆరోపించొద్దు : ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భార్యాభర్తల్లో ఎవరో ఒకరు 'ఇదంతా నీ వల్లే ఇలా జరిగిందంటూ' ఇతరులపై నెపం వేస్తారు. మరి కొందరైతే 'నేను మాత్రమే ఇంటిని సరైన రీతిలో నడిపిస్తున్నా' అని అంటుంటారు. ఇలా అన్నింటికీ నేను అని అంటుంటే ఆ అనుబంధం బలంగా ఉండదంటున్నారు నిపుణులు. ఇద్దరూ తలో బాధ్యతనూ పంచుకుంటూ, ఇంటిని నడిపించాలని చెబుతున్నారు. దంపతులిద్దరూ కలిస్తేనే కుటుంబం అనే విషయాన్ని గ్రహించి ఒకరికొకరు తోడుగా నిలిస్తే ఆ సంసారం సంతోషంగా సాగుతుందట.పోల్చడం : 'నువ్వు వారిలా ఎందుకు ఎక్కువ సంపాదించలేకపోతున్నావు?', 'నువ్వు ఎందుకు వీరిలా అందంగా రెడీ అవ్వట్లేదు?' ఇలా ఇతరులతో పోల్చుతూ ఉంటారు. ఇలా మాట్లాడితే.. వారి మనసు నొచ్చుకుంటుందని నిపుణులు చెబుతున్నారు. ఎంత చేసినా వేస్ట్ అన్న ఫీలింగ్‌కి వచ్చేస్తారని, ఇద్దరి మధ్య మనస్పర్థలు ఎక్కువ అవుతాయని అంటున్నారు. అందుకే, ఎప్పుడూ, ఎవరినీ ఇతరులతో పోల్చకూడదని, ప్రతి వ్యక్తీ ప్రత్యేకమే అని చెబుతున్నారు.

# రెండు మోడళ్లతో "రెడ్?మీ నోట్ 15 ప్రో" సిరీస్ వచ్చేసింది- ధర, ఫీచర్లు ఎలా ఉన్నాయ




రెడ్‌మీ భారతదేశంలో తన "నోట్ 15 ప్రో సిరీస్ 5+"ని విడుదల చేసింది. ఈ లైనప్?లో "రెడ్‌మీ నోట్ 15 ప్రో 5+", "రెడ్‌మీ నోట్ 15 ప్రోం 5+" అనే రెండు మోడళ్లు ఉన్నాయి. ఈ రెండు ఫోన్లూ 200వీూ డ్యూయల్ రియర్ కెమెరా సెటప్‌ను కలిగి ఉన్నాయి. ఇవి ఆండ్రాయిడ్ 15 ఆధారిత షావోమీ హైపర్‌ఓఎస్ 2పై నడుస్తాయి.

ఈ కొత్త "రెడ్‌మీ నోట్ 15 ప్రో 5+" కీలక ఫీచర్లలో అల్ట్రా ూఒఉ ూమీూజుఉ డిస్‌ప్లే, మీడియాటెక్ డైమెన్సిటీ 7400 అల్ట్రా చిప్‌సెట్, 8+దీ =ూవీ, 256+దీ వరకు స్టోరేజ్, 45ఔ ఫాస్ట్ వైర్డ్, 18ఔ రివర్స్ ఛార్జింగ్?కు సపోర్ట్ చేసే 6,580ూహ్ట్ర బ్యాటరీ ఉన్నాయి.

ఇక "రెడ్‌మీ నోట్ 15 ప్రోం 5+"లో క్వాడ్-కర్వ్డ్ అల్ట్రా ూఒఉ డిస్‌ప్లే, స్నాప్‌డ్రాగన్ 7ం జెన్ 4 ప్రాసెసర్, 12+దీ వరకు =ూవీ, 512+దీ స్టోరేజ్, 100ఔ ఫాస్ట్ వైర్డ్, 22.5ఔ రివర్స్ ఛార్జింగ్ సపోర్ట్‌తో కూడిన రెడ్‌మీ నోట్ 15 ప్రో 5+ సిరీస్ ధర, లభ్యత:రెడ్‌మీ నోట్ 15 ప్రో 5+ "రెడ్‌మీ నోట్ ప్రోం 5+" ధర రూ. 34,999 నుంచి మొదలవుతుంది.సేల్ వివరాలు: ఈ రెండు స్మార్ట్?ఫోన్ల ఫస్ట్ సేల్ ఫిబ్రవరి 3, 2026న ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11:59 గంటల వరకు భారత ప్రామాణిక సమయం (ఖూ) ప్రకారం అందుబాటులో ఉంటుంది. ఆసక్తి ఉన్న కస్టమర్లు అమెజాన్‌లో రూ. 1,999 టోకెన్ మొత్తానికి చెల్లించడం ద్వారా వీటిని ప్రీ-బుక్ చేసుకోవచ్చు.కలర్ ఆప్షన్లు: రెడ్‌మీ నోట్ 15 ప్రో 5+ కార్బన్ బ్లాక్, మిరాజ్ బ్లూ, సిల్వర్ యాష్ రంగులలో లభిస్తుంది. అయితే "నోట్ 15 ప్రోం 5+" కార్బన్ బ్లాక్, కాఫీ మోచా, మిరాజ్ బ్లూ షేడ్స్‌లో అందుబాటులో ఉంటుంది.

రెడ్‌మీ నోట్ 15 ప్రో, రెడ్‌మీ నోట్ 15 ప్రోం 5+ ఫీచర్లు, స్పెసిఫికేషన్లు: డిస్?ప్లే: ఈ రెండు ఫోన్లలోనూ 6.83-అంగుళాల ూమీూజుఉ డిస్?ప్లే ఉంటుంది. ఇది 1.5ఖ (1,280 ఞ 2,772 పిక్సెల్స్) రిజల్యూషన్, 120ఒఞ రిఫ్రెష్ రేట్, 3,200 నిట్స్ బ్రైట్‌నెస్?ను అందిస్తుంది. వీటి డిస్‌ప్లేకు గొరిల్లా గ్లాస్ విక్టస్ 2 ప్రొటెక్షన్ కూడా ఉంది.

ప్రాసెసర్: రెడ్‌మీ నోట్ 15 ప్రోం 5+ స్నాప్‌డ్రాగన్ 7ం జెన్ 4 చిప్‌సెట్‌తో పనిచేస్తుంది. ఇది 12+దీ వరకు =ూవీ, 512+దీ వరకు ఇంటర్నల్ స్టోరేజ్?తో వస్తుంది. అదే సమయంలో "రెడ్‌మీ నోట్ 15 ప్రో 5+"లో మీడియాటెక్ డైమెన్సిటీ 7400-అల్ట్రా ూశీజ ఉంది. ఇది 8+దీ =ూవీ, 256+దీ వరకు ఆన్‌బోర్డ్ స్టోరేజ్?ని అందిస్తుంది.

కెమెరా సెటప్:ఈ రెడ్‌మీ నోట్ 15 ప్రో సిరీస్ 5+లోని రెండు మోడళ్లలోనూ ఒకే విధమైన వెనుక కెమెరా సెటప్ ఉంది. ఇందులో ూఖూతో కూడిన 200-మెగాపిక్సెల్ ప్రైమరీ కెమెరా, 8-మెగాపిక్సెల్ అల్ట్రా-వైడ్-యాంగిల్ లెన్స్ ఉన్నాయి. ప్రో మోడల్‌లో 20-మెగాపిక్సెల్ సెల్ఫీ కెమెరా ఉండగా, రెడ్‌మీ నోట్ 15 ప్రోంలో 32-మెగాపిక్సెల్ ఫ్రంట్ ఫేసింగ్ కెమెరా ఉంది.బ్యాటరీ కెపాసిటీ: రెడ్‌మీ నోట్ 15 ప్రోం 5+ ఫోన్‌లో 100ఔ వైర్డ్ ఛార్జింగ్, 22.5ఔ రివర్స్ వైర్డ్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేసే 6,500ూహ్ట్ర బ్యాటరీ ఉంది. అయితే "రెడ్‌మీ నోట్ 15 ప్రో 5+"లో 45ఔ ఫాస్ట్ ఛార్జింగ్, 22.5ఔ రివర్స్ ఛార్జింగ్ మద్దతుతో కూడిన 6,580ూహ్ట్ర బ్యాటరీ ఉంది.కనెక్టివిటీ ఫీచర్లు: రెడ్‌మీ నోట్ 15 ప్రో సిరీస్ 5+లోని కనెక్టివిటీ ఆప్షన్‌లలో 5+, ఔఱ-ఖీఱ 6జు వరకు, బ్లూటూత్ 5.4, ఉూ, చీఖీజ, ఖూదీ టైప్-జ ఉన్నాయి. రెండు మోడళ్లలోనూ డాల్బీ అట్మోస్, హై-రెస్ ఆడియో సపోర్ట్‌తో కూడిన స్టీరియో స్పీకర్లు ఉన్నాయి. రేటింగ్: ఈ రెండు ఫోన్లు దుమ్ము, నీటి నుంచి రక్షణ కోసం ఎూ66 ం ఎూ68 ం ఎూ69 ం ఎూ69ఖ రేటింగ్‌లను కలిగి ఉన్నాయిఆపరేటింగ్ సిస్టమ్: ఈ సిరీస్?లోని రెడ్‌మీ నోట్ 15 ప్రోం 5+, రెడ్‌మీ నోట్ 15 ప్రో 5+ రెండు ఫోన్లూ ఆండ్రాయిడ్ 15 ఆధారిత హైపర్‌ఓఎస్ 2పై పనిచేస్తాయి.

# ఆకాశాన్నంటే పండగ - పతంగులతో ఆనందమే కాదు ఆరోగ్యం కూడా!



సంక్రాంతి వచ్చిందంటే చాలు, నేలపై అందమైన ముగ్గులు, ఆకాశంలో రంగు రంగుల పతంగులు. పండగ వేళ చిన్నాపెద్ద అనే తేడా లేకుండా అందరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలిపటాలు ఎగరవేస్తూ తెగ సందడి చేస్తుంటారు. ఇది కేవలం సంప్రదాయం, సరదా మాత్రమే కాదు, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంతోపాటు ఎన్నో లాభాలు చేకూరుస్తుందంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!శారీరక వ్యాయామం : గాలిపటం ఎగరవేయడం అంత ఈజీ ఏమి కాదు. గాలిపటాన్ని గాల్లోకి లేపడానికి కాస్త బలాన్ని ఉపయోగించాలి. దారాన్ని పట్టుకొని పైకి లాగడం, గాలి దిశని బట్టి కదిలించడం, దారాన్ని సర్దడం ఇవన్నీ చేస్తున్నప్పుడు చేతులు, భుజాలు, కాళ్లు సహా శరీరంలో అనేక కండరాలు కదులుతాయి. ఇదొక ఎక్సర్?సైజ్?లా పనిచేసి శరీరం చురుగ్గా మారుతుంది. కండరాలు బలపడటంతో పాటు గుండె ఆరోగ్యం మెరుగవుతుందని నిపుణులు చెబుతున్నారు.మీ ఫ్రెండ్ మాట్లాడట్లేదా? - ఇలా చేయాలంటున్న నిపుణులు!మానసిక ఉల్లాసం : పతంగులు ఎగరవేస్తున్నంత సేపు మన దృష్టి అంత దానిపైనే ఉంటుంది. దీనివల్ల రోజువారీ ఒత్తిళ్లు, చదువు లేదా ఉద్యోగ సంబంధిత ఆందోళనలన్నీ మర్చిపోతాం. నిత్యం ఇంట్లో, స్కూల్? లేదా ఆఫీసులో ఉండే వారంతా ఈ పండగ వేళ ఇంటి మేడ మీద, విశాలమైన మైదానాల్లో గడుపుతుంటారు. ఆకాశంలో రంగురంగుల గాలిపటాలు కనువిందు చేస్తూ ప్రశాంతతను ఇస్తాయి. ఈ క్రమంలో ఉదయం పూట/ సాయంత్రం వేళ ఆరుబయట వీచే గాలి మానసిక ఉల్లాసాన్ని పెంచుతుందంటున్నారు నిపుణులు.సమన్వయం - నైపుణ్యం : మన శరీరంలో అన్ని భాగాల మధ్య సమన్వయం, పరిస్థితుల్ని చక్కదిద్దడానికి నైపుణ్యాలు అవసరం. ఇవి రెండూ గాలిపటాలతో మెరుగవుతాయని నిపుణులు చెబుతున్నారు. గాలిలో ఉన్న పతంగిని నియంత్రిస్తున్నప్పుడు చేతికి, కంటికి మధ్య సమన్వయం మెరుగవుతుందంటున్నారు. ఈ క్రమంలో దారాన్ని ఎప్పుడు వదలాలి? ఎప్పుడు లాగాలి? వంటి తక్షణ నిర్ణయాలు, ఏకాగ్రత, సమస్య పరిష్కార సామర్థ్యం, ఓర్పు పిల్లల్లో పెరుగుతాయట. ఈ నపుణ్యాలు డైలీ లైఫ్?లో ఉపయోగపడతాయి.సామాజిక అనుబంధం : కుటుంబం, ఫ్రెండ్స్?తో కలిసి పతంగులు ఎగరవేస్తున్నప్పుడు, కైట్ ఫెస్టివల్ పేరుతో జరిగే కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు మనుషుల మధ్య పరస్పర అనుబంధం పెరుగుతుంది. అంతేకాదు, పిల్లలు - పేరెంట్స్ మధ్య ప్రేమనురాగాలు



మరింత బలపడతాయట. ఒకరితో ఒకరు పోటీపడటం, ప్రోత్సహించడం, ఆశనిరాశలు, సమన్వయం చేసుకోవడం, సంతోషాలు, బాధలు అన్నీ ఆటలో భాగమవుతాయి. దీని ద్వారా సామాజిక బంధాలూ మెరుగవుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.సృజనాత్మకత : సొంతగా గాలిపటాలు, దారాలు తయారు చేసుకోవడం, పతంగుల రూపకల్పన, అలంకరణ, ఎంపిక వంటివి పిల్లల్లో సృజనాత్మక ఆలోచనలను పెంచుతాయి. అలాగే, గాలిపటాన్ని విజయవంతంగా ఎగరవేసినప్పుడు ఆనందం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. ఇవి భవిష్యత్తులో చిన్నారుల ఎదుగుదలకు ఎంతగానో దోహదపడతాయి. సృజనాత్మక కార్యకలాపాలకు ప్రేరణగా నిలుస్తాయట.ప్రకృతితో మమేకం : ఎప్పుడూ ఫోన్, టీవీ, కంప్యూటర్ లాంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్‌తో గడిపే మనల్ని సంక్రాంతి వేళ గాలిపటాల ఆట ప్రకృతిలో మమేకం చేస్తుంది. స్వచ్ఛమైన గాలి మన జీవితాలకు, ప్రకృతికి ఉన్న అనుబంధాన్ని మరోసారి గుర్తు చేస్తుంది. సూర్యకాంతి వల్ల డి విటమిన్ అందుతుంది. స్వచ్ఛమైన గాలితో ఊపిరితిత్తులకు ఉపశమనం లభిస్తుంది.సంప్రదాయం కొనసాగింపు : పతంగులు ఎగరవేయడం అనేది భారతీయ సంప్రదాయాల్లో ఒక భాగం. దీని ద్వారా పిల్లలకు సంక్రాంతి ప్రాముఖ్యతను తెలియజేయడంతో పాటు మన సంస్కృతిని ముందు తరాలకు అందించినట్లు ఉంటుంది.

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం



# ఆరోసారి విశ్వవిజేతగా భారత్...

● అండర్19 వరల్డ్ కప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై గ్రాండ్ విక్టరీ ● అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 100 పరుగుల తేడాతో భారత్ ఘనవిజయం ● కేవలం 80 బంతుల్లో 175 పరుగులతో విధ్వంసం సృష్టించిన వైభవ్ సూర్యవంశీ
● భారీ లక్ష్యఛేదనలో ఫల్కనర్ (115) సెంచరీతో ఒంటరి పోరాటం చేసినా ఇంగ్లండ్‌కు తప్పని ఓటమి
● టోర్నీ ఆద్యంతం అద్భుత ప్రదర్శనతో అపజయం ఎరుగకుండా టైటిల్ నెగ్గిన టీమిండియా



అండర్-19 క్రికెట్‌లో భారత యువ జట్టు మరోసారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. హరారే వేదికగా జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 100 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. తద్వారా రికార్డుస్థాయిలో ఆరోసారి అండర్-19 ప్రపంచకప్‌ను ముద్దాడి చరిత్ర సృష్టించింది. తొలుత బ్యాటింగ్‌లో పరుగుల సునామీ సృష్టించి, ఆపై బౌలింగ్‌లో అద్భుతంగా రాణించి ఇంగ్లండ్‌ను ఆలౌట్ చేసింది.భారత్ నిర్దేశించిన 412 పరుగుల భారీ లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. బెన్ డాకిన్స్ (66), బెన్ మేయస్ (45) వేగంగా పరుగులు సాధించారు. అయితే, భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను దెబ్బకొట్టారు. ఒక దశలో 177 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది. ఈ సమయంలో కాలెబ్ ఫల్కనర్ (67 బంతుల్లో 115) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 9 ఫోర్లు, 7 సిక్సర్లతో అద్భుత శతకం బాది ఒంటరి పోరాటం చేశాడు. అతనికి జేమ్స్ మింటో (28) నుంచి కొంత సహకారం లభించినా, అది గెలుపునకు సరిపోలేదు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో ఇంగ్లండ్ పోరాటం 40.2 ఓవర్లలో 311 పరుగుల వద్ద ముగిసింది. భారత బౌలర్లలో ఆర్ఎస్ అంబ్రీష్ 3 వికెట్లతో సత్తా చాటగా, కనిష్క్ చౌహాన్, దీపేష్ దేవేంద్రన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 80 బంతుల్లో 15 ఫోర్లు, 15 భారీ సిక్సర్లతో ఏకంగా 175 పరుగులు చేసి ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతని ఇన్నింగ్స్‌తో భారత్ భారీ స్కోరుకు బలమైన పునాది పడింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (53) బాధ్యతాయుతమైన అర్ధశతకంతో రాణించగా, వేదాంత్ త్రివేది (32), విహాన్ మల్హోత్రా (30), వికెట్ కీపర్ అభిగ్యాన్ కుందు (40) విలువైన పరుగులు జోడించారు. చివర్లో కనిష్క్ చౌహాన్ (20 బంతుల్లో 37 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో జేమ్స్ మింటో 3 వికెట్లు తీశాడు.భారత్ గతంలో 2000, 2008, 2012, 2018, 2022లో అండర్-19 కప్ ను గెలిచింది. ఇప్పుడు రికార్డు స్థాయిలో ఆరోసారి కప్ సాధించి, అండర్-19 ప్రపంచకప్ చరిత్రలో తన తిరుగులేని ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది. మ్యాచ్ అనంతరం భారత ఆటగాళ్లు త్రివర్ణ పతాకాలను చేతబూని మైదానంలో సంబరాలు జరుపుకున్నారు.

# వరల్డ్ రికార్డులు బద్దలుకొట్టిన వైభవ్

హరారే వేదికగా జరుగుతున్న అండర్-19 వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌లో భారత యువ జట్టు బ్యాట్‌తో పెను తుఫాన్ సృష్టించింది. ఇంగ్లాండ్‌తో జరిగిన తుది సమరంలో తొలుత బ్యాటింగ్ చేపట్టిన టీమిండియా మొదటి బంతి నుంచే దూకుడుగా ఆడుతూ ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచింది. ఫైనల్ మ్యాచ్ అనే ఒత్తిడిని ఏమాత్రం లెక్కచేయని భారత ఆటగాళ్లు స్కోర్ బోర్డు పరుగులు పెట్టేలా చేశారు. వచ్చిన వాళ్లు వచ్చినట్లు బాదుతూ.. మొత్తంగా 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయిన టీమిండియా 411 పరుగులు చేసింది. ఇంగ్లండ్ విజయం సాధించాలంటే 412 పరుగులు చేయాల్సిందే. ఈ మ్యాచ్‌కు అసలు హీరోగా నిలిచిన ఆటగాడు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ. తొలి ఓవర్లలోనే ఫోర్లు, సిక్సర్లతో స్టేడియాన్ని హోరెత్తించిన వైభవ్ ఇంగ్లాండ్ బౌలింగ్ దాడిని పూర్తిగా చీల్చిచెండాడు. కేవలం 55 బంతుల్లోనే శతకం పూర్తి చేసి ఫైనల్ మ్యాచ్‌కు కావాల్సిన మజాను అందించాడు. శతకం తర్వాత కూడా ఆగకుండా మరో గేర్ వేసిన అతడు 25 బంతుల్లోనే 75 పరుగులు జోడించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచాడు. చివరకు క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగినా అతడి ఇన్నింగ్స్ మ్యాచ్ దిశను పూర్తిగా భారత్ వైపుకు తిప్పింది. వైభవ్ ఇన్నింగ్స్ గణాంకాలు చూస్తే ఏ స్థాయి విధ్వంసం జరిగిందో అర్థమవుతుంది.



# స్మృతి మంధానకు కోహ్లీ స్పెషల్ విషెస్




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఛాంపియన్‌గా నిలవడంతో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ హర్షం వ్యక్తం చేశాడు. అద్భుతమైన విజయం సాధించిన ఆర్సీబీ మహిళల జట్టుకు, మేనేజ్‌మెంట్‌కు విరాట్ శుభాకాంక్షలు తెలిపాడు. కెప్టెన్ స్మృతి మంధాన, ఆర్సీబీ జట్టును చూసి గర్వపడాలని అన్నాడు. రెండోసారి ఛాంపియన్‌గా నిలిచి ఆర్సీబీ పతాకాన్ని అత్యున్నత స్థానంలో ఎగురవేశారని అభినందించాడు. ఈ మేరకు సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ షేర్ చేశాడు.'రెండోసారి ఛాంపియన్‌గా నిలిచి ఆర్సీబీ పతాకాన్ని అత్యున్నత స్థానంలో ఎగురవేశారు. మిమ్మల్ని చూస్తుంటే గర్వంగా ఉంది. స్మృతి మంధాన, ఆర్సీబీ జట్టు, మేనేజ్‌మెంట్‌కు శుభాకాంక్షలు. ఈ విజయానికి మీరు నిజమైన అర్హులు. ఈ అద్భుతమై క్షణాలను ఆస్వాదించండి' అని విరాట్ కోహ్లీ ఆర్సీబీ ట్రోఫీ ఫొటోను షేర్ చేస్తూ రాసుకొచ్చాడు. మహిళల జట్టు నెగ్గడంతో విరాట్ పోస్టు పెట్టడంపై ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఐపీఎల్‌లో తమ జట్టు కూడా ఇదే రిపీట్ చేయాలని ఆశిస్తున్నట్లు కామెంట్లు పెడుతున్నారు.ఈ ఫైనల్‌లో ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన (87 పరుగులు, 41 బంతుల్లో) సూపర్ ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. అయితే మంధాన జ్వరంతో బాధపడుతూనే ఈ మ్యాచ్‌లో బరిలో దిగినట్లు ఆర్సీబీ కోచ్ మలోలన్ రంగరాజన్ తెలిపాడు. అనారోగ్యంగా ఉన్నప్పటికీ జట్టు కోసం బరిలో దిగడాన్ని ఆయన కొనియాడాడు. ఈ మేరకు మ్యాచ్ అనంతరం ప్రెస్‌మీట్‌లో రంగరాజన్ చెప్పాడు. 'ఫైనల్ మ్యాచ్‌లో మంధాన అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడింది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు మంధాన తీవ్రమైన ఫ్లూతో బాధ పడుతోంది. చాలా అనారోగ్యంగా ఉంది. కానీ ఆ ప్రభావం మ్యాచ్ మీద పడలేదు. దీని గురించి నేను ఆమెతో మాట్లాడినప్పుడు, 'ప్రాబ్లమ్ ఏం లేదు, నేను ఆడతాను' అని చెప్పింది. గత ఏడాది కాలంగా ఆమె మంచి ఫామ్‌లో ఉంది. అయిత ఆమె ఈ రోజు ఆడిన ఇన్నింగ్స్‌ను వర్ణించడానికి మాత్రం నాకు మాటలు చాలడం లేదు. మంచి టైమింగ్‌తో బ్యాటింగ్ చేసింది. వీలు చిక్కినప్పుడు ఎటాకింగ్ మోడ్‌లోకీ మారింది. బ్యాటింగ్‌లో ఆమె ఒక మేధావి. తన ఆటను, నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటుంది' అని రంగరాజన్ పేర్కొన్నాడు.

# ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడు

## - టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా అమెరికాతో జరిగే తొలి మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. ప్రస్తుతం ఇషాన్ కిషన్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడని తెలిపాడు. న్యూజిలాండ్, సౌతాఫ్రికాతోనే కాకుండా దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ ఇషాన్ కిషన్ సత్తా చాటాడని సూర్యకుమార్ యాదవ్ గుర్తు చేశాడు.న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో ఇషాన్ కిషన్ అద్భుత ప్రదర్శన కనబర్చిన సంగతి తెలిసిందే. తిలక్ వర్మ గైర్హాజరీలో తుది జట్టులో అవకాశం అందుకున్న ఇషాన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. న్యూజిలాండ్‌తో ఆఖరి టీ20లో శతకం బాదిన ఇషాన్ కిషన్.. సౌతాఫ్రికాతో వామప్ మ్యాచ్‌లోనూ హాఫ్ సెంచరీతో రాణించి నిలకడను చాటుకున్నాడు. మరోవైపు న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో దారుణంగా విఫలమైన సంజూ శాంసన్ తుది జట్టులో చోటు కోల్పోయాడు.తిలక్ వర్మ రీఎంట్రీ ఇవ్వడంతో సౌతాఫ్రికాతో వామప్ మ్యాచ్‌లో టీమిండియా మేనేజ్‌మెంట్ ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా ఆడించింది. మూడో స్థానంలో ఆడిన తిలక్ వర్మ కూడా మెరుగైన ప్రదర్శన చేశాడు. దాంతో సంజూ బెంచ్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమెరికాతో మ్యాచ్ నేపథ్యంలో గురువారం మీడియాతో మాట్లాడిన సూర్యకుమార్ యాదవ్‌ను ఓపెనింగ్ స్లాట్ గురించి ప్రశ్నించగా.. ఇషాన్ కిషన్ బరిలోకి దిగుతాడని చెప్పాడు. అతని దూకుడైన బ్యాటింగ్‌తో జట్టుకు ఎంతో ప్రయోజకరమవుతుందని అభిప్రాయపడ్డాడు.'గత కొన్ని మ్యాచ్‌ల్లో ఇషాన్ కిషన్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. దేశవాళీ క్రికెట్‌లోనూ సత్తా చాటాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ దూకుడుగా ఆడి తన జట్టును విజేతగా నిలబెట్టాడు. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో ఇషాన్ కిషన్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. వార్మప్ మ్యాచ్‌లో మాత్రం ఓపెనర్‌గా వచ్చాడు. అతను ఏ స్థానంలో బ్యాటింగ్ చేసినా అదే దూకుడు కొనసాగించాలని కోరుకుంటున్నాను. ఏ స్థానంలో ఆడించినా.. తన జోరు కొనసాగిస్తాడని ఆశిస్తున్నా.'అని సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో ముగిసిన టీ20 సిరీస్‌లో సంజూ శాంసన్ దారుణంగా విఫలమయ్యాడు. ఐదు ఇన్నింగ్స్‌ల్లో కేవలం 46 పరుగులే చేశాడు. అత్యధిక స్కోరు 24 మాత్రమే. 2025 నుంచి టీ20ల్లో ఓపెనర్‌గా అతను 11 ఇన్నింగ్స్‌లలో 12.18 సగటుతో కేవలం 134 పరుగులు మాత్రమే సాధించాడు, అత్యధిక స్కోరు 37. మరోవైపు ఇషాన్ కిషన్..




# ఇంకోసారి ఆలోచించండి- లేదంటే భారీగా నష్టపోతాం

టీ20 వరల్డ్‌కప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించడంతో ఈ అంశం క్రీడావర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో తమ వైఖరి ఇదేనని పాక్ చెప్పినప్పటికీ, ఐసీసీ ఇంకా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో సస్పెన్స్ కొనసాగుతోంది. అయితే దీనిపై శ్రీలంక క్రికెట్ బోర్డు (రాజు) స్పందించింది. భారత్‌తో మ్యాచ్ బాయ్‌కాట్ ఆలోచనను పునఃపరిశీలించాలని కోరుతూ ఓ లేఖ రాసినట్లు తెలిసింది. ఇలాంటి చర్యలు భారీగా ఆర్థిక నష్టాలకు దారితీయవచ్చని లేఖలో ఎస్ఎల్‌సీ పేర్కొంది.'ఈ టోర్నమెంట్‌ను నిర్వహించడానికి మా దేశం ఎంతో ఆసక్తిగా ఉంది. శ్రీలంకలో జరగనున్న అన్ని మ్యాచ్‌లకు సంబంధించి ఆతిథ్య ఏర్పాట్లు, భద్రతా సన్నాహాలు, టికెట్ల అమ్మకాలు ఇప్పటికే పూర్తయ్యాయి.



# టీమిండియాకు బిగ్ షాక్

## హర్షిత్ రాణా గాయంతో జట్టుకు దూరం

## రాణా స్థానంలో సిరాజ్‌ను ఎంపిక

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభానికి ముందే టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. యువ పేసర్ హర్షిత్ రాణా గాయంతో జట్టుకు దూరమైనట్లు తెలుస్తోంది. సౌతాఫ్రికాతో వామప్ మ్యాచ్‌లో హర్షిత్ రాణా మోకాలి నొప్పితో ఇబ్బంది పడ్డాడు. ఆ మ్యాచ్‌లో ఒక ఓవర్ మాత్రమే బౌలింగ్ చేసిన హర్షిత్ రాణా 16 పరుగులు ఇచ్చాడు. ఆ సమయంలోనూ రెండు సార్లు తన రనప్‌ను ఆపాడు.తన కుడి మోకాలిని పట్టుకుని తీవ్రమైన నొప్పితో మైదానాన్ని వీడాడు. ఆ తర్వాత మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టలేదు. అయితే హర్షిత్ రాణా కుడి మోకాలి జాయింట్‌లో



సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. స్కాన్లలోనూ ఆ విషయం వెల్లడైనట్లు జాతీయ మీడియా పేర్కొంది. వైద్యుల సూచన మేరకు హర్షిత్ రాణా మెటా టోర్నీ నుంచి తప్పుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే హర్షిత్ రాణా గాయంపై బీసీసీఐ ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.మెగా టోర్నీకి ముందు మీడియా సమావేశంలో పాల్గొన్న సూర్యకుమార్ యాదవ్‌ను హర్షిత్ రాణా గాయం గురించి ప్రశ్నించగా.. అవునని బదులిచ్చాడు. 'హర్షిత్ రాణా గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. ఆ విషయం మాకు ఈ రోజే తెలిసింది. ఒకవేళ హర్షిత్ రాణా జట్టుకు దూరమైతే.. అది మాకు పెద్ద నష్టం. మేం వేరే కాంబినేషన్లను ప్రయత్నిస్తాం. అయితే మా రిజర్వ్ బెంచ్ బలంగా ఉంది.'అని సూర్యకుమార్ యాదవ్ చెప్పుకొచ్చాడు.హర్షిత్ రాణా స్థానంలో మహమ్మద్ సిరాజ్‌ను భారత సెలెక్టర్లు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. గత టీ20 ప్రపంచకప్ 2024 గెలిచిన జట్టులో సభ్యుడైన సిరాజ్, హర్షిత్ స్థానంలో జట్టుతో చేరడానికి ఇప్పటికే ముంబై చేరుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.



# అర్జున్ కూతురు హీరోయిన్‌గా సీతాపయనం

## ఈనెల 14న గ్రాండ్‌గా విడుదలకు సన్నాహాలు

యాక్షన్ కింగ్ అర్జున్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన విభిన్న కథా చిత్రం 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా ద్వారా అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ వెండితెరకు కథానాయికగా పరిచయం అవుతుండటం విశేషం. నిరంజన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ వంటి దిగ్గజ నటులు కీలక పాత్రలు పోషించగా, అర్జున్ స్వయంగా ఒక ప్రత్యేక పాత్రలో మెరవనున్నారు. అలాగే ఆయన మేనల్లుడు, యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా కూడా ఈ మూవీలో స్పెషల్ కామియో రోల్‌లో కనిపించబోతున్నారు. ఈ సినిమాను ప్రేమికుల రోజు కానుకగా ఫిబ్రవరి 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది.ప్రస్తుతం అన్ని రకాల పోస్ట్ ప్రొడక్షన్ పనులతో పాటు సెన్సార్ కార్యక్రమాలను కూడా పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఇప్పటికే పాజిటివ్ బజ్‌ను సొంతం చేసుకుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే విడుదలైన పాటలు, ఇతర కంటెంట్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే హృద్యమైన అంశాలతో పాటు, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ చిత్రాన్ని అర్జున్ అద్భుతంగా తీర్చిదిద్దారు. తెలుగుతో పాటు కన్నడ, తమిళం, మలయాళం మరియు హిందీ భాషల్లో ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత ప్రమాణాలతో రూపొందింది. జి. బాలమురుగన్ సినిమాటోగ్రఫీ అందించగా, ప్రముఖ రచయిత సాయి మాధవ్ బుర్రా పదునైన డైలాగ్స్ రాశారు. యాక్షన్ కింగ్ సినిమా అంటేనే ÷ట్స్ స్పెషల్‌గా ఉంటాయి కాబట్టి, ఈ చిత్రంలోని స్టంట్ సన్నివేశాలకు కిక్ యాస్ కాళీ కొరియోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వినూత్న ప్రచార కార్యక్రమాలతో ప్రేక్షకుల్లోకి వెళ్తున్న మేకర్స్, త్వరలోనే సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఫిబ్రవరి 14న ఐదు భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న 'సీతా పయనం' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో వేచి చూడాలి.



# మైత్రీ మూవీ మేకర్స్‌తో నవీన్ పోలిశెట్టి చిత్రం

'అనగనగా ఒక రాజు' చిత్రంతో మొదటిసారి రూ.100 కోట్ల క్లబ్‌లో చోటు దక్కించుకున్నాడు టాలీవుడ్ యంగ్ అండ్ ఎనర్జిటిక్ స్టార్ నవీన్ పోలిశెట్టి. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ విజయంతో నవీన్ పోలిశెట్టి తన కెరీర్‌లో తొలి వంద కోట్ల మైలురాయిని అందుకున్న నటుడిగా నిలిచారు. అయితే ఈ అద్భుతమైన విజయంతో ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ స్పందిస్తూ నవీన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా తమ తదుపరి ప్రాజెక్ట్‌లో నవీన్ భాగమవుతుండడంతో ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ప్రకటించింది. అయితే మైత్రీ బ్యానర్‌లో రాబోతున్న ఈ చిత్రం ఎలా ఉండబోతుందని ప్రేక్షకులకు ఎదురుచూస్తున్నారు.

# 'ఇది భ్రమల ప్యాలెస్'

## క్యూట్ పిక్స్ షేర్ చేసిన రాశీ ఖన్నా



'ఊహలు గుసగుసలాడే' సినిమాతో తెలుగు సినీ ప్రేక్షకులకు పరిచయమైన రాశీ ఖన్నా తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకుంది. చివరిగా సిద్ధు జొన్నలగడ్డ సరసన 'తెలుసు కదా' చిత్రంలో కనిపించింది. ఈ సినిమాలో రాశీ ఖన్నాకు మంచి మార్కులు పడ్డాయి. ప్రస్తుతం ఆమె పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సరసన 'ఉస్తాద్ భగత్ సింగ్'లో నటిస్తోంది. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. మార్చి 26న ఈ సినిమా రిలీజ్ కాబోతోంది. ఈ సినిమాలో శ్రీలీల కూడా హీరోయిన్ గా నటిస్తోంది. మరోవైపు, రాశీ ఖన్నా తాజాగా ఇన్స్టాగ్రామ్ లో షేర్ చేసిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోల్లో బ్లాక్ అవుట్ ఫిట్ తో, బ్లాక్ పెండెంట్ ఉన్న చైన్ తో రాశి బోల్డ్ గా కనిపిస్తోంది. ఈ ఫొటోలకు 'ఇది భ్రమల ప్యాలెస్' అంటూ క్యాప్షన్ పెట్టింది.

# సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో రాకాస






టాలీవుడ్ యంగ్ హీరో సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'రాకాస' ఇప్పుడు సినీ ప్రియుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'మ్యాడ్' సినిమాతో యువ ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించిన సంగీత్ శోభన్ ఈసారి ఫాంటసీ,హారర్ జానర్‌లో కొత్త ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రంలో 'ఆయ్' మూవీ ఫేమ్ నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తుండగా, దర్శకురాలు మానస శర్మ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమాను పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారిక కొణిదెల, ఉమేష్ కుమార్ బన్సాల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గతంలో నిహారిక నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' సినిమా బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడంతో, ఆమె నిర్మాణంలో వస్తున్న ఈ కొత్త ప్రాజెక్ట్‌పై కూడా మంచి అంచనాలు ఏర్పడ్డాయి. యువతరానికి దగ్గరగా ఉండే కథలు, కొత్త కాన్సెప్ట్‌కి ప్రాధాన్యం ఇస్తూ నిహారిక నిర్మాణంలో వస్తున్న ప్రతి చిత్రం ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటోంది. ఇటీవల విడుదలైన 'రాకాస' టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఫాంటసీ ఎలిమెంట్స్, హారర్ బ్యాక్‌డ్రాప్, కామెడీ టచ్ అన్నీ కలగలిపి వినోదభరితంగా టీజర్ ఉండటంతో సినిమాపై బజ్ ఒక్కసారిగా పెరిగింది. సోషల్ మీడియాలో కూడా ఈ టీజర్‌కు మంచి స్పందన లభించింది. అప్పటి నుంచి సినిమా రిలీజ్ ఎప్పుడన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'రాకాస' చిత్రాన్ని 2026 ఏప్రిల్ 3న సమ్మర్ కానుకగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు స్పెషల్ పోస్టర్ ద్వారా వెల్లడించారు. సమ్మర్ హాలిడే సీజన్‌ను టా÷-గ్గ÷ట్ చేస్తూ వస్తున్న ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు యువతను కూడా ఆకట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఫాంటసీ, హారర్, హిలేరియస్ కామెడీ అంశాలతో ఫుల్ ఆన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం సంగీత్ శోభన్ కెరీర్‌లో మరో ప్రత్యేక మైలురాయిగా నిలుస్తుందా అనే ఆసక్తి నెలకొంది. విభిన్న జానర్‌లో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితం సాధిస్తుందో తెలుసుకోవాలంటే ఏప్రిల్ వరకు వేచి చూడాల్సిందే.




# శ్రీవిష్ణు 'మృత్యుంజయ' విడుదల తేదీ ఖరారు

విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరించే హీరో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త థ్రిల్లర్ మూవీ 'మృత్యుంజయ' విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాను ఈ ఏడాది ఫిబ్రవరి 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రంలో రెబా జాన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

ఈ సందర్భంగా శ్రీవిష్ణు తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో రిలీజ్ డేట్ పోస్టర్‌ను పంచుకున్నారు. "ఫిబ్రవరి 27న 'మృత్యుంజయ' థియేటర్లలో మీ హృదయాలను గెలుచుకోవడానికి వస్తోంది. ఈ థ్రిల్లింగ్ కథతో మిమ్మల్ని కలుస్తాను" అని రాసుకొచ్చారు. హీరోయిన్ రెబా జాన్ కూడా పోస్టర్ షేర్ చేస్తూ, "ప్రతి సమాధానం మరో ప్రాణాంతకమైన ప్రశ్నను లేవనెత్తుతుంది. ఫిబ్రవరి 27న 'మృత్యుంజయ' సినిమా హాళ్లలోకి వస్తోంది" అని పేర్కొన్నారు.

హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై మొదటి నుంచి మంచి అంచనాలు ఉన్నాయి. గతేడాది విడుదలైన టైటిల్ టీజర్, సినిమా ఒక ఆసక్తికరమైన క్రైమ్ థ్రిల్లర్ అని స్పష్టం చేసింది. ఇందులో రెబా జాన్ ఒక పోలీస్ అధికారి పాత్రలో నటిస్తుండగా, శ్రీవిష్ణు పాత్రపై సస్పెన్స్ కొనసాగుతోంది. టీజర్‌లోని కొన్ని విజువల్స్ ఆధారంగా అతను జైలులో ఖైదీగా కనిపించవచ్చని ప్రేక్షకులు అంచనా వేస్తున్నారు.

ఈ సినిమాను సందీప్ గున్నం, వినయ్ చిలకపాటి నిర్మిస్తుండగా, రమ్య గున్నం సమర్పిస్తున్నారు. కాలభైరవ సంగీతం అందిస్తుండగా, ప్రముఖ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# 11న ఓటిటిలోకి అనగనగా ఒక రాజు




ఈ ఏడాది సంక్రాంతికి థియేటర్లలో విడుదలైన సినిమాల్లో 'అనగనగా ఒక రాజు' ఒకటి. ఈ మూవీ ఓటీటీ రిలీజ్ డేట్ ఖరారైంది. ఈనెల 11 నుంచి 'నెట్‌ఫ్లిక్స్' లో స్ట్రీమింగ్ కానుంది. గోదావరి నేపథ్యంతో కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన 'అనగనగా ఒక రాజు' పండగ సినిమా అనిపించుకుంది. తన కామెడీ టైమింగ్ ఎలాంటిదో హీరో నవీన్ పొలిశెట్టి ఈ చిత్రంతో మరోసారి నిరూపించారు. ఆయనకు జోడీగా నటించిన మీనాక్షీ చౌదరి అందం, అభినయంతో ఆకట్టుకున్నారు. ఈ మూవీలో చమ్మక్ చంద్ర, 'సంక్రాంతికి వస్తున్నాం' ఫేమ్ బుల్లిరాజు, రావు రమేశ్ తదితరులు సందడి చేశారు. దర్శకుడు మారి తెరకెక్కించిన ఈ సినిమా జనవరి 14న విడుదలైన సంగతి తెలిసిందే. రూ.100? కోట్లు కలెక్ట్ చేసిన సందర్భంగా.. హీరో నవీన్‌కు ప్రొడ్యూసర్ నవీన్ ఎర్నేని తాజాగా కంగ్రాట్స్ చెప్పారు. తమ కాంబినేషన్‌లో మరో మూవీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా అని తెలిపారు. గౌరవపురం జమీందార్ గోపరాజు మనవడు రాజు (నవీన్ పొలిశెట్టి). జమీందార్ మనవడు అనే పేరు తప్ప ఆస్తులేమీ మిగలకపోవడంతో ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ, పగటి కలలు కంటూ కాలం గడుపుతుంటాడు. బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే జీవితంలో స్థిరపడిపోవచ్చనే నిర్ణయానికొస్తాడు. చారులత (మీనాక్షి)ని చూశాక ఆమే తన రాణి అయితే కష్టాలన్నీ గట్టెక్కేయొచ్చని భావించి, ఆమె మనసుని గెలచుకోవాలని రంగంలోకి దిగుతాడు. మరి, చారులత మనసుని ఎలా గెలిచాడు? ఆమె జీవితంలోకి వచ్చాక రాజు కష్టాలు తొలగిపోయాయా? రాజు రాజకీయాల్లోకి అడుగుపెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? అన్నదే మిగతా కథ.